

సోమశిలలో 31.499 టీఎంసీల నిల్వ



అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 17 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలకుగాను 31.499 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,400, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.

తెగని ఉత్కంఠ!

- కందుకూరు వైసీపీ అభ్యర్థిత్వంపై హైడ్రామా!?
- ఎమ్మెల్యే మానుగుంటకు ఈసారి రిక్తహస్తమే!
- చంద్రబాబు, లోకేష్, పవన్‌ను తిట్టకపోవడమే కారణం
- బీసీలను బరిలోకి దించాలని జగన్ యోచన
- ఉదయం నుంచి ఎమ్మెల్యే అనిల్ పేరు.. రాత్రికి కోట్ల రామారావు పేరు ప్రస్తావన
- జగన్ తీరుతో మహీధర్‌రెడ్డి కలత




నెల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులో వైసీపీ రాజకీయం రసకందాయంలో పడింది. వారం రోజులుగా హాట్‌టాపిక్‌గా ఉన్న రాజకీయ పరిణామాలు బుధవారం మరింత వేగం పుంజుకున్నాయి. టీడీపీ అగ్రనేతలు చంద్రబాబు, లోకేష్, జనసేనాని పవన్ కల్యాణ్‌లను తిట్టని నేరానికి ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి వైసీపీ అధిష్ఠానం ఈసారి రిక్తహస్తం చూపుతోంది. రానున్న ఎన్నికల్లో ఆయనకు టికెట్టు ఇవ్వకూడదని నిర్ణయించుకున్న వైసీపీ అధినేత జగన్ ఆ దిశగా పావులు కదిపారు. ఈ క్రమంలో బీసీ వర్గాలకు టికెట్టు ఇవ్వాలని జగన్ నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరిగింది. ఆ ప్రచారాన్ని బలపరిచేలా మంగళవారం రాత్రి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్‌ను అమరావతికి పిలిపించుకున్నారు. ఆయన్ను కందుకూరు పంపడానికి ఒప్పించే ప్రయత్నం చేశారు.

● స్థానికులతో వాకాబు

దాదాపుగా అనిల్‌ను కందుకూరుకు పంపడం ఖాయమయ్యిందని జిల్లా వైసీపీ నాయకులకు సైతం సమాచారం అందింది. అయితే, తాను నగరం నుంచే పోటీ చేస్తానని అనిల్ పట్టుపట్టడంతో చేసేది లేక జగన్ సమ్మతించినట్లు తెలిసింది. ఆ తర్వాత సీఎం కార్యాలయం నుంచి కందుకూరులో వైసీపీ ముఖ్య నాయకులకు ఫోన్లు వచ్చాయి. కందుకూరుకు యాదవ్ సామాజికవర్గానికి చెందిన బొట్ల రామారావు, పెరుగు మురళీకృష్ణ, అప్పనబోయిన నరసింహులలో ఎవరు బలమైన అభ్యర్థి అవుతారని ఆరా తీశారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి బొట్ల రామారావు యాదవ్ పేరు బలంగా ప్రచారంలోకి వచ్చింది. రామారావు వ్యాపారవేత్త, యాదవ సామాజికవర్గంలో ముఖ్య నాయకుడిగా గుర్తింపు ఉన్న వ్యక్తి కావడంతో వైసీపీ అధిష్ఠానం ఆయన వైపే మొగ్గుచూపినట్లు చెబుతున్నారు.

● అవమానంగా భావిస్తూ..

మహీధర్‌రెడ్డి మాత్రం తనకు టికెట్టు ఇచ్చినా వైసీపీలో కొనసాగే ఆలోచనలో లేనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విషయాన్ని ఆయన ముఖ్య అనుచరులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. తనకు మాటమాత్రం కూడా చెప్పకుండా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇతరులకు టికెట్టు ఇవ్వడం కోసం స్థానిక నాయకులను వాకాబు చేయడాన్ని ఆయన తీవ్ర అవమానంగా భావిస్తున్నట్లు చెబుతున్నారు. జగన్ తీరుకు తీవ్ర మనస్తాపానికి గురైన మహీధర్‌రెడ్డి ఇక వైసీపీలో కొనసాగడం మర్యాద కాదని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో టిక్కెట్టు ఇస్తామన్నా తీసుకొని వైసీపీ నుంచి పోటీ చేయడానికి మహీధర్‌రెడ్డి సిద్ధంగా లేరని అంటున్నారు.



● వీపీఆర్ పట్టు

అయితే నెల్లూరు ఎంపీ స్థానంనుంచి బరిలో ఉన్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాత్రం మహిధర్‌రెడ్డి కోసం గట్టిగా పట్టుబడుతున్నారు. ఒకవైపు మహీధర్‌రెడ్డికి సర్ది చెబుతూ, మరోవైపు ఆయన టికెట్టు విషయమై అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే వీపీఆర్ ప్రయత్నాలు ఎంత మాత్రం ఫలిస్తాయన్నది అనుమానమే. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను మార్పు చేయాలని వీపీఆర్ అధిష్ఠానాన్ని కోరారు. ఆ మార్పులేవి జరగకపోగా, తాను గట్టిగా కోరుకున్న మహీధర్‌రెడ్డిని పార్టీ నుంచి సాగనంపే ప్రయత్నాలు జరగడాన్ని వీపీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని సమాచారం. మొత్తమ్మీద కందుకూరు వైసీపీలో చోటు చేసుకున్న పరిణామాలు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో సైతం మార్పులు తీసుకొచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. .



వేడుకగా పోలేరమ్మ గ్రామోత్సవం

అల్లూరు: అల్లూరులో జరుగుతున్న తిరునాళ్లలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి తర్వాత పోలేరమ్మ అమ్మవారి గ్రామోత్సవం వేడుకగా జరిగింది. అశ్వ వాహనంపై కొలువుదీరిన అమ్మవారిని చూసేందుకు భక్తజనం పోటెత్తింది. ఈ సందర్భంగా గంగపెట్టి, వీర తాళ్లతోపాటు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ సుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఊరేగింపు బుధవారం సాయంత్రం వరకు కొనసాగింది. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వ్యాపారవేత్తలు కావ్య కృష్ణారెడ్డి, పసుపులేటి సుధాకర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. మ్యూజికల్ నైట్‌లో బుల్లితెర నటులు బుల్లెట్ భాస్కర్, నరేష్ టీమ్‌తోపాటు పల్సర్ బైక్ గాయకుడు రమణ, నృత్య ప్రదర్శనల ఝాన్సీ, సినీ గాయకుడు ధనుంజయలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

'షోకాజ్' అస్త్రం!

- 2,546 మంది అంగన్‌వాడీలకు నోటీసులు
- పది రోజుల్లో విధుల్లో చేరాలని ఆదేశం
- ససేమిరా అంటున్న ఆందోళనకారులు
- ఉధృతం కానున్న ఉద్యమం

నెల్లూరు (వైద్యం) జనవరి 10 : డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కిన అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం కన్నెర్ర జేసింది. వారి న్యాయమైన కోరికలను మన్నించకపోగా 'ఎస్మా' చట్టాన్ని ప్రయోగించింది. తాజాగా షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 2546 మందికి షోకాజ్ నోటీసులు అందచేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అంగన్వాడీలు భగ్గుమంటున్నారు.



కావలి ప్రాంతంలో అంగన్వాడీ కుటుంబ సభ్యులకు నోటీసులు ఇస్తున్న అధికారులు

● సమ్మె నెల రోజులకు..

అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి నెల రోజులకు చేరుకుంది. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని తదితర డిమాండ్లతో నెల రోజులుగా వారు సమ్మె చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం ఇప్పటికే మూడు సార్లు అంగన్‌వాడీ నేతలతో చర్చించినా కొలిక్కి మాత్రం రాలేదు. ఈ నెల 5వ తేదీలోపు విధుల్లో చేరాలని, లేకుంటే చర్యలు తప్పవంటూ ప్రభుత్వం కూడా హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికలను ఏమాత్రం లెక్క చేయని అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ బాధ్య తను సచివాలయాలకు ప్రభుత్వం అప్పగించింది. అలాగే ఈ నెల 6వ తేదీన అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించింది. ఈ చట్టం అమలుపై అంగన్ వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమపట్ల నిరంకుశంగా వ్యవహ రిస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారులు అంగన్వాడీలకు ఐదు సెట్ల షోకాజ్ నోటీసులు అందజేసి, పది రోజుల్లో విధుల్లో చేరాలని, ప్రభుత్వ ఉత్తర్వులు తప్పక పాటించాలని హెచ్చ రిస్తున్నారు.

● 2,546 మందికి నోటీసులు

జిల్లాలో 2934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఇప్పటివరకు 2,546 మందికి షోకాజ్ నోటీసులు అందచేశారు. తహసీల్దార్లు, వీఆర్వోలు, సీడీపీవోలు అంగన్వాడీల ఇళ్లకు వెళ్లి వ్యక్తిగతంగా లేదా వారి ఇళ్లకు, పక్కింటి వారికి నోటీసులు అందిస్తున్నారు. పోస్టల్ ద్వారా 1670 మందికి నోటీసులు పంపించారు. అయితే చాలా మంది నోటీసులు తీసుకునేందుకు నిరాకరించడంతో వారి ఇళ్లకు, అంగన్ వాడీ కేంద్రాలకు నోటీసులు అతికిస్తున్నారు.

నోటీసులు పంపిణీ చేస్తున్నాం



అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు పంపిణీ చేస్తున్నాం. కొందరు నిరాకరిస్తుండటంతో వారి ఇళ్లకు, అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు అంటిస్తున్నాం. 10 రోజుల్లో విధుల్లో చేరాలన్న ప్రభుత్వ నిర్ణ యాన్ని వెల్లడించాం. 2780 మంది సమ్మెలో ఉన్నా పౌష్టికాహార పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సచివాలయాల ద్వారా పంపిణీ జరుగుతోంది.

- హేన సుజన్, ఐసీడీఎస్ పీడీ

తగ్గేదే లేదు!

● అంగన్‌వాడీ నేతల స్పష్టీకరణ

నెల్లూరు (వైద్యం) జనవరి 10 : ఎస్మా చట్టం, షోకాజ్ నోటీసులు వంటి ఎన్ని ప్రయోగాలు చేసినా తగ్గేదే లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మె బుధవారానికి 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భం కలెక్టరేట్ వద్ద జరుగుతున్న నిరాహార దీక్షలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెహనాబేగం మాట్లాడారు. అంగన్‌వాడీలను ఎన్ని రకాలుగా ఒత్తిడి చేసినా తమ డిమాండ్లు సాధించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ జగన్ ఇచ్చిన హామీ మేరకు సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె విరమించబోమని వెల్లడించారు. ఈ దీక్షలో సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, యూనియన్ నేతలు కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి, సుమతి, ఉషా,కల్పన, నాగభూషణమ్మ, రత్నమ్మ, హారతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు : కలెక్టరేట్ వద్ద దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీలు

కొల్లగొట్టిన క్వార్ట్జ ఎంత!?

'నెల్లూరు జిల్లాలో ఏం జరుగుతోంది!? మాకందిన ఫిర్యాదును బట్టి ఆస్థాయిలో క్వార్ట్జ్‌ను తవ్వేస్తుంటే మీరేం చేస్తున్నారు. అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు. కొల్లగొట్టిన ప్రకృతి సంపద ఎంత? ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి పది రోజుల్లో నివేదిక ఇవ్వండి.'

- రాష్ట్ర, జిల్లా అధికారులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలివి



- వెంటనే విచారించి.. నివేదిక ఇవ్వండి!
- రాష్ట్ర అధికారులకు కేంద్రం ఆదేశం
- ప్రకృతి సంపద దోపిడీపై టీడీపీ నేత సోమిరెడ్డి ఫిర్యాదు
- ఆధారాలు సహా ప్రధాని, కేంద్రమంత్రికి లేఖ

రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారిన క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిలకు చేసిన ఫిర్యాదుపై కేంద్ర అధికారులు కదిలారు. జీపీఎస్ ఫొటోలతో సహా సోమిరెడ్డి ఫిర్యాదు చేయడంతో దానిని పరిగణలోకి తీసుకున్నారు. సంబంధిత అధికారులు ఈ ఫిర్యాదును పరిశీలించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. సదరు ఫిర్యాదుపై వెంటనే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ ధీరజ్‌కుమార్ రాష్ట్ర గనుల శాఖ అదనపు చీఫ్ సెక్రటరీకి ఈ నెల 1వ తేదీన ఆదేశాలు పంపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా తప్పనిసరి పరిస్థితుల్లో స్పందించాల్సి వచ్చింది. వెంటనే విచారించి నివేదిక ఇవ్వాలని డైరెక్టర్ ఆఫ్ మైన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఈ నెల 4వ తేదీన ఆదేశించారు. అదే విషయాన్ని సోమిరెడ్డికి కూడా తెలియజేశారు. దీంతో అక్రమ క్వార్ట్జ్ తవ్వకాలపై ఎట్టకేలకు కదలిక వచ్చింది.

● రాష్ట్రంలో ఒక్కరు స్పందిస్తే ఒట్టు!

అంతర్జాతీయ మార్కెట్లో రూ.2వేలు ఉన్న క్వార్ట్జ్ 30వేలకు చేరడంతో వైసీపీ నేతల కన్ను ఈ క్వార్ట్జ్‌పై పడింది. తొలుత జిల్లాలోని పెద్ద నాయకులే క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్వకొని సొమ్ముచేసుకోవడం ప్రారంభించారు. ఆ తర్వాత ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడంతో ఒక్కో మండలం ఒక్కొక్కరు తవ్వకునేలా పంచాయితీ చేశారు. ప్రభుత్వ భూములే కాకుండా ప్రైవేటు మైన్లను కూడా వదలకుండా దౌర్జన్యంగా తవ్వుతున్నారు. దీనిపై జిల్లాలోని టీడీపీ ముఖ్య నేతలంతా పోరాటం చేయడం మొదలుపెట్టారు. తొలుత సైదాపురం వెళ్లి ఆందోళన చేయడంతో కొన్ని రోజులు తవ్వకాలు ఆపేసిన అక్రమార్కులు ఆ తర్వాత మళ్లీ మొదలుపెట్టారు. పొదలకూరు మండలం వరదాపురం సమీపంలోని రుస్తుం, భారత్ మైన్లలో తవ్వకాలపై హైకోర్టు స్టే ఇచ్చినా లెక్కచేయకుండా క్వార్ట్జ్‌ను తరలించారు. దీనిని గత నెలలో అడ్డుకున్న టీడీపీ నేత సోమిరెడ్డి సత్యాగ్రహ దీక్షకు కూర్చున్నారు. సుమారు 40 వాహనాలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడమేగాక ప్రమాదకరమైన జిలిటెన్ స్టిక్స్ వంటి భారీ పేలుడు పదార్థాలను గుర్తించారు. వీటన్నింటినీ జీపీఎస్ ఫొటోలతో సహా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీ, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ (డీఎంజీ), కలెక్టర్, ఎస్పీలకు పంపి ఫిర్యాదు చేశారు. కానీ ఎవరూ స్పందించలేదు. మూడు రోజుల అనంతరం చివరకు అర్ధరాత్రిన సోమిరెడ్డి సత్యాగ్రహ దీక్షను భగ్నం చేసి, వాహనాలనూ వదిలేశారు.

● అధికారుల తీరుపై ఫిర్యాదు

నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ప్రజా సంపదను కొల్లగొడుతున్నా రాష్ట్రంలో ఏ ఒక్క అధికారి స్పందించడం లేదని ప్రధానమంత్రి, కేంద్ర మంత్రికి చేసిన ఫిర్యాదులో సోమిరెడ్డి పేర్కొన్నారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై జీపీఎస్ ఫొటోలతో సహా ఆధారాలు సమర్పించినా పట్టించుకోకకుండా ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నారని వివరించారు. అనుమతులు లేకుండా విలువైనక్వార్ట్జ్‌ను దేశం దాటిస్తుండటంతో కేంద్ర ప్రభుత్వానికి కూడా భారీ నష్టం కలుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై పది రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం స్పందించి విచారణకు ఆదేశించడం గమనార్హం. అయితే అంతకముందు జిల్లా నుంచి రాష్ట్రం వరకు అనేక మంది అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ స్పందించలేదు. ఇప్పుడు కేంద్రం పట్టించుకోవడంతో రాష్ట్ర అధికారుల్లో చలనం వచ్చింది. అయితే సోమిరెడ్డి ఫిర్యాదుపై ఎటువంటి విచారణ జరుపుతారు..? కేంద్రానికి ఏమని నివేదిక ఇస్తారన్నది!? ఆసక్తిగా మారగా, సంబంధిత అధికారుల్లో మాత్రం వణుకు మొదలైంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

పనులు చేయకనే... పైసలు నొక్కేసే యత్నం!



సంగంలోని ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం

- 2021-22 ఎఫ్‌డీఆర్ కింద రూ. 1.5 కోట్లు కాజేసే పన్నాగం
- ఓ ప్రజాప్రతినిధి పీఏ, సంగంలోని కీలకనేత హస్తం
- చివరి నిమిషంలో వెలుగులోకి..
- ఉన్నతాధికారుల హెచ్చరిక
- ఆగిన బిల్లుల అప్‌లోడ్

సంగం, జనవరి 10: సంగం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో 2021- 22 ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్ (ఎఫ్‌డీఆర్) కింద పనులు చేయకుండానే రూ. 1.5 కోట్లను కాజేసేందుకు బిల్లులు పెట్టే ప్రయత్నం చేశారు. గతనెల 31న చివరి నిమిషంలో విషయం తెలుసుకున్న ఇద్దరు నాయకులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నిధుల దోపిడీకి అడ్డుకట్ట పడింది. ఇందులో ఓ ప్రజా ప్రతినిధి పీఏతోపాటు ఆ ప్రజాప్రతినిధికి ముఖ్య అనుచరుడు సంగం గ్రామానికి చెందిన కీలకనేత హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

వివరాల్లోకి వెళితే... సంగం ఇరిగేషన్ సెక్షన్‌లో దువ్వూరు కాలువ, కనిగిరి ప్రధాన కాలువ పరిధిలోని బ్రాంచి కాలువలు, మండ లంలోని ఇతర 10 చెరువుల పరిధిలో సుమారు 12 వేల ఎకరాల విస్తీర్ణం ఉంది. 2021- 22లో కురిసిన భారీ వర్షాలకు సోమశిల నుంచి వరద వచ్చింది. సుమారు 5 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం సంగం ఆనకట్టకు వచ్చింది. ఈ వరదతో పెన్నా బ్యారేజ్‌తోపాటు చెరువులు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అప్పట్లో ఎఫ్‌డీఆర్ పనులకు ప్రతిపాదనలు పంపారు. 28 పనులకు రూ. 1.97 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో స్థానిక నాయకుడు ఒకరు అప్పట్లో కావలికి చెందిన ఓ కాంట్రాక్టర్‌ను సంప్రదించారు. ఆయన ముందుకు రావడంతో నామినేషన్ మీద అగ్రిమెంట్ చేశారు. కానీ పనులు చేయలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలు ముంచుకొస్తుండడంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధికి ముఖ్య అనుచరుడిగా ఉన్న సంగం గ్రామానికి చెందిన ఓ కీలకనేత, ఆ ప్రజాప్రతినిధి, ఎఫ్‌డీఆర్ పనులకు అప్పట్లో ఇన్‌చార్జిగా ఉన్న ఏఈతో కుమ్మక్కైయ్యారు. వచ్చేబిల్లులో కీలకనేతతోపాటు ప్రజాప్రతినిధి పీఏకు 60శాతం, దొంగ బిల్లులు చేసిన అధికారికి 40 శాతం ఇచ్చేటట్లు ఒప్పందం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ మేరకు గత నెలాఖరులో బిల్లులు సిద్ధం చేశారని తెలిసింది. అయితే బిల్లులను ప్రస్తుతం సెక్షన్‌లో ఏఈగా ఉన్న అధికారి థంబ్ వేసి అప్‌లోడ్ చేయాలి. లేకపోతే గుట్టుచప్పుడు కాకుండా బిల్లులు అప్‌లోడ్ అయిపోయేవి. ఈ క్రమంలో ఎలాగో మండలంలోని ఓ ఇద్దరు వైసీపీ నేతలకు విషయం తెలిసింది. దీంతో వారు వెంటనే స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో విషయం బహిర్గతం కావడంతో బిల్లులు అప్‌లోడ్‌కు సాహసం చేయలేకపోయారు. . అయితే ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడింది.

● బిల్లుల విషయమై కలకలం

ఈ నేపథ్యంలో మంగళవారం సంగంలో ఓ కల్యాణ మండపంలో వైసీపీ ప్రజాప్రతినిధిలు, గ్రామ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అక్రమ బిల్లుల విషయం చర్చకు రావడంతో కలకలం రేగింది. దీంతో సదరు నాయకుడు చీమకుట్టినట్లుగా వ్యవహరించినట్లు మిగతా నాయకులు గుసగుసలాడుకున్నారు. ఎట్టకేలకు రూ.1.5 కోట్ల ప్రభుత్వ సొమ్ము దోపిడీకి గురికాకుండా చేసుకున్నామని చెప్పుకుంటున్నారు.

● అంతా పుకార్లే...

ఈ విషయంపై ఏఈఈ బీవీ కృష్ణను వివరణ కోరగా అంతా పుకార్లేనని కొట్టి పారేశారు. నన్ను కూడా చాలా మంది అడిగారు. అదేమి లేదని చెప్పా. ఎవరైనా బిల్లులు రికార్డ్ చేసినా నేను థంబ్ వేసి అప్‌లోడ్ చేయాలి. పనులు చేయకుండా నేనెలా చేస్తాను. అలాంటిదేమి జరగలేదన్నారు.

నేటి నుంచి విధుల్లోకి

పారిశుధ్య సిబ్బంది

- మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ
- స్థానిక సమస్యలపై నేడు కమిషనర్‌తో భేటీ

నెల్లూరు (సిటీ) : సమాన పనికి సమాన వేతనం, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్న డిమాండ్లతో సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు గురువారం నుంచి విధుల్లోకి రానున్నారు. బుధవారం యూనియన్ నేతలు, రాష్ట్ర ప్రభు త్వం మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్లు సంఘా ల నాయకులు ప్రకటించారు. నెల్లూరులోనూ బుధవారం అర్ధరాత్రి నుంచే విధుల్లోకి వస్తారని సీఐటీయూ నాయకులు ప్రకటించారు. కాగా సమ్మె కాలంలో కార్మికులపై పెట్టిన కేసులు, స్థానికంగా కార్పొరేషన్ నుంచి అం దాల్సిన ప్రయోజనాలు తదితర అంశాలపై గురువారం మధ్యా హ్నం 12 గంటలకు కమిషనర్ వికాస్‌మర్మత్‌తో కార్మిక సంఘాల నాయకులు భేటీ అవుతారని సీఐటీయూ నేత కత్తి శ్రీనివాసులు తెలిపారు.



● కాగా బుధ వారం పారిశుధ్య కార్మికులు నెల్లూరు గాంధీబొమ్మ కూడలి నుంచి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కత్తి శ్రీనివాసులు, పద్మ, కొండమ్మ, బాగ్యమ్మ, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. ఎంత పనిచేశావ్ తల్లీ!

- ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం
- యువకుడి వేధింపులే కారణమన్న కుటుంబీకులు
- సైదాపురం పోలీసుస్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన



ఆటోలో ఉన్న శిరీష మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి

సైదాపురం, జనవరి10: యువకుడి వేధింపులతో మన స్తాపం చెంది ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని బుధవారం బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన సైదాపురంలో చోటుచేసుకుంది. దీంతో బంధువులు పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు, సైదాపురం గ్రామానికి చెందిన శిరీష(17) గూడూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన కోలా జశ్వంత్(21) కూడా గూడూరులో తృతీయ సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. ఈ క్రమంలో అతను శిరీషను తరచుగా వేధించేవాడు.ఈ విషయం శిరీష తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా జశ్వంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా శిరీషను, ఆమె తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఏమి జరిగిందో ఏమో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శిరీష ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆటోలో మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, రాపూరు సీఐ సుబ్రహ్మణ్యం పోలీస్‌స్టేషన్ చేరుకుని ఆందోళనకారులకు సర్ది చెప్పడంతో వారు వెనుతిరిగారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కోటారెడ్డి మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

దోచుకో... దాచుకో !

- ఆ అధికారి రూటే సప'రేటు'
- రూ.2 లక్షల పనికి రూ.10 లక్షలు మంజూరు
- వివరాలకు వైసీపీ నేతను సంప్రదించాలని సలహా

కలిగిరి, జనవరి 10: కలిగిరి మండలంలో సోమశిల ఉత్తర కాలువకు అనుసంధానంగా ఉన్న శ్రీకొలను బ్రాంచి కాలువ పూడిక తీత పనులను మండలంలోని అధికారపార్టీకి చెందిన బడానేతకు అప్పనంగా అప్పగించారు. ఈ విషయంలో రూ. లక్షలు ప్రజాధనం దుర్వినియోగానికి అధికారులు తెర తీసినట్లు బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. సేకరించిన వివరాల మేరకు, సోమశిల ఉత్తర కాలువకు అనుసంధానంగా మండలంలోని వెంకన్నపాలెం సమీపంలోని శ్రీకొలను కాలువలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో శ్రీకొలను సున్నా కిలో మీటరు నుంచి 11కిలోమీటర్ల వరకు పనులు చేసేందుకు రూ.9.5 లక్షలు మంజూరయ్యాయి. నాలుగేళ్లగా వైసీపీకి చెందిన ఆ బడానేతే ఆ పనులను నామినేషన్ వర్క్‌గా ఆర్డర్ వేయించుకొని చేయిస్తున్నారు. చిన్న చిన్న గండ్లు, పూడికతీత పనులకు అధిక మొత్తంలో ఎస్టిమేషన్‌లు వేయించి నీకింత.. నాకింత.. అంటూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నాడు. సహించలేని పలువురు పూడికతీత పనుల వద్దకు వెళ్లి వర్క్ ఆర్డర్ కాపీ చూపించమని కోరగా మీకు చూపించాల్సిన అవసరం లేదు, బడానేత (కాటం రవీంద్రారెడ్డి)ని అడగండని చెప్పడంతో వారు సోమశిల ఉత్తర కాలువ ఏఈ క్రిష్ణయ్య తో వాగ్వాదానికి దిగారు. రూ.2లక్షలతో అయ్యే పూడికతీత పనులకు రూ.10లక్షలు ఎలా మంజూరయ్యాయో, పూర్తి వివరాలు కావాలని కోరారు. మీకు చెప్పాల్సిన అవసరం లేదు, అవసరమైతే కేసు పెట్టుకోండి... అని బెదిరింపులకు దిగాడు. స్థానికంగా ఉన్న మట్టితోనే గండ్లు పూడ్చి వేస్తూ, బ్రాంచికాలువలో ఎక్స్‌కవేటర్‌తో పైపైన పూడికతీత పనులు చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కాలువ పనులపై విచారణ జరిపించి, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీకొలను బ్రాంచి కాలువలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్



వర్క్‌ఆర్డర్ కాపీ చూపించాలని ఏఈని కోరుతున్న స్థానికులు

వర్క్ ఆర్డర్ కాపీలు చూపించలేదు...

ఈ విషయమై ఏఈని వివరణ కోరగా పనులు జరుగుతున్న ప్రదేశానికి పలువురు వ్యక్తులు తాము ప్రజాప్రతినిధులమని, జనసేన, వైసీపీ నాయకులమంటూ వచ్చారని, పనుల విషయాలు తెలియకుండా మాట్లాడటం, వైసీపీలో వర్గవిభేదాలతో వారు మాట్లాడటంతో వారికి వర్క్ ఆర్డర్ కాపీలను చూపించలేదన్నారు. నిబంధనల ప్రకారమే పనులు చేయిస్తున్నామన్నారు.

'హిట్ అండ్ రన్' రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట డ్రైవర్స్, క్లీనర్స్ ధర్నా



ధర్నా చేస్తున్న డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (హరనాథపురం), జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట బుధవారం డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వా హక అధ్యక్షు డు షౌకత్ మాట్లాడుతూ ఆ నల్లచట్టం వల్ల డ్రైవర్ల జీవితాలు మరింత హీనస్థితికి చేరు తాయన్నారు. పదేళ్ల జైల్లో ఉంటే కుటుంబ జీవితాన్ని కోల్పోతారన్నారు. అంతేకాకుండా ఏడు లక్షల రూపాయల అపరాధ రుసుం చెల్లించే స్తోమత డ్రైవర్లకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చట్టాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి లవన్నకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో అసోసియేషన్ నాయకులు రవి, వెంకటేశ్వర్లు, బాషా, జాన్, రమణయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	210
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5947
వెండి కిలో ధర	రూ. 73,700
వెండి ఒక గ్రాము	రూ. 75.70

రైలు కింద పడి మహిళ మృతి

నెల్లూరు(క్రైం), జనవరి 10: నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ యార్డు వద్ద బుధవారం గూడూరు-విజయవాడ మెమూ రైలు కింద పడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్యకు పాల్ప డింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీ లించారు. మృతదేహంపై లేత గులాబీ రంగు జాకెట్టు, పచ్చ రంగుపై బంగారు రంగు గళ్లు, ఇంద్రధనస్సు రంగుల అంచు చీర ఉన్నాయని, 55 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్ఐ ఎస్ హరిచందన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రీసర్వే పాసుపుస్తకాలకు

రుణ అర్హత లేదా?

- నిరాకరిస్తున్న బ్యాంకర్లు
- బ్యాంకుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



అల్లూరు, జనవరి 10: వ్యవసాయ భూములపై రుణాలు పొందాలనుకుంటే రైతులకు భూయాజమాన్యపు హక్కు పత్రం, పట్టాదారు పాసుపుస్తకం ఉంటే చాలు. అవి ఉంటే పంట రుణం లేదా దీర్ఘకాలిక రుణం మంజూరు చేస్తారు. అయితే వైసీపీ ప్రభుత్వం భూశాశ్వత హక్కు పథకం ద్వారా చేపట్టిన రీసర్వే అనంతరం మంజూరు చేసిన పాసుపుస్తకంపై రుణాలు ఇచ్చేది లేదని బ్యాంకర్లు తేల్చి చెప్తున్నారు. సాధారణంగా భూమిపై హక్కును కలిగిన రైతు పేరు వెబ్‌లాంyడ్‌లో పొందుపరచి ఉంటే పంట రుణాన్ని వెంటనే మంజూరు చేస్తారు. కానీ రీసర్వే తర్వాత మంజూరు చేసిన వెబ్‌ల్యాండ్-2 రికార్డుపై పంట రుణం కూడా వీలు లేకుండా పోయింది. రాష్ట్రమంతా ఇదే పరిస్థితి. పురాతన పట్టాదారు పాసుపుస్తకం ఉంటే దానిపై ఇస్తామంటున్నారు తప్ప, సీఎం ఫొటో ఉన్న పాసుపుస్తకంపై రుణం ఇవ్వలేమని బ్యాంకర్లు తేల్చి చెబుతున్నారు.

● పాతదానికే విలువ

రుణాల మంజూరుకు రీసర్వే చేపట్టక ముందు రెవెన్యూ శాఖ మంజూరు చేసిన భూయాజమాన్యపు హక్కు పత్రం, వెబ్‌ల్యాండ్‌లో 1బీ నమూనా, అడంగల్ పహాణి ఉంటే సరిపోయేది. రీసర్వే అనంతరం ల్యాండ్ పొజిషన్ నెంబరు (ఎల్‌పీఎం) అంటూ కొత్త పద్ధతిని తీసుకురావాలని ఉద్దేశంతో చేపట్టిన వెబ్‌ల్యాండ్ రికార్డుతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. సాంకేతిక సమస్యలతోపాటు భూ విస్తీర్ణంలో కూడా సమస్యలు తలెత్తాయి. కాగా వెబ్‌లాంyడ్ సమస్య రుణాల మంజూరుకు అడ్డంకిగా మారింది.

● బ్యాంకర్లకు జతకాని వెబ్‌ల్యాండ్-2

రుణాలు మంజూరు చేయాలంటే బ్యాంకర్లు రైతుల భూరికార్డులను ఆన్‌లైన్‌లో పరిశీలన చేస్తారు. ఇందుకుగాను సర్వేనెంబర్లను, వెబ్‌ల్యాండ్‌లో రెవెన్యూ శాఖ జతచేసి ఉంటారు. తద్వారా రైతులకు రుణాలను మంజూరు చేస్తారు. రీ సర్వే చేపట్టిన అనంతరం ఏర్పడిన వెబ్‌ల్యాండ్-2ను ఇప్పటి వరకు వివరాలను బ్యాంకర్లకు జతచేయలేదు. దీంతో సదరు రైతు ల పేర్లు నమోదు కాలేద ని బ్యాంకర్లు చెబుతున్నారు. కావున రుణాలు ఇవ్వలేమని చెబుతున్నారు.

● బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

రుణాల కోసం రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అర్హత కలిగిన భూరికార్డులు రైతుల వద్ద ఉన్నప్పటికీ వెబ్‌ల్యాండ్-2 బ్యాంకర్లకు అందుబాటులో లేకపోవడంతో వారు ఏమీ చేయలేని పరిస్థితి. దీంతో చేసేది లేక రైతులు ఎప్పటికైనా రుణాలు ఇవ్వకపోతారా అంటూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రుణాలు ఇవ్వలేం..

వెబ్‌ల్యాండ్-2లో వివరాలు నమోదు కానందున రుణాలు ఇవ్వలేం. అందులో నూ సీఎం ఫొటో ఉన్నా పాసుపుస్తకంపై అభ్యంతరాలు ఉన్నాయని పేరు చెప్పేందుకు ఇష్టపడని అల్లూరులోని ఓ బ్యాంకు మేనేజర్ తెలిపారు.

రీసర్వేతో అన్నీ అనర్థాలే..



రీసర్వేతో భూముల విస్తీర్ణం తగ్గడం కానీ, పెరగడం కానీ జరుగుతోంది. విస్తీర్ణం తగ్గిన రైతులు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు. వీటి ద్వారా రుణాలు పొందాలంటే బ్యాంకర్లు ససేమిరా అంటున్నారు. ఈ సమస్య నుంచి వెంటనే రైతులకు విముక్తి కల్పించాలి.

- విడవలూరు దశరథరామిరెడ్డి, రైతు, నార్తుమోపూరు

ఆ పాసుపుస్తకం ఎందుకు ?



రీసర్వే అనంతరం మంజూరు చేసే పట్టాదారు పాసుపుస్తకం రుణాలు పొందేందుకు ఉపయోగపడకపోతే ఇంకెందుకు..? జగనన్న బొమ్మ ఉన్న పాసుపుస్తకాన్ని అధికారులు కనీసం చేతికి కూడా తీసుకోవడం లేదు. ఇక బ్యాంకర్లు రుణాలు ఎలా ఇస్తారు?

- పప్పు సుధాకర్, రైతు అల్లూరు

జంబ్లింగ్ పద్ధతిలో ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

నెల్లూరు (విద్య), జనవరి 10 : ఇంటర్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షలను జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించాలని పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం నెల్లూరులోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో డీవీఈవో మధుబాబుకు వారు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం అనుమతి తీసుకున్న కళాశాలల్లోనే విద్యార్థుల సంఖ్యను బట్టి పరీక్షలు నిర్వహించాలన్నారు. అనుమతిలేని కళాశాలల అనుబంధంగా ఏర్పాటు చేసిన హాస్టల్స్ నిర్వహణపై విచారణ, చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి కళాశాల ల్యాబ్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు సేఫ్టీ పరికరాలు ఉంచేలా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. థియరీ పరీక్షల పర్యవేక్షకులుగా ఎంఈవో నేతృత్వంలో అర్హత కలిగిన అధ్యాపకులను నియమించాలన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఇంటర్‌బోర్డు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని వారు వివరించారు. సంబంధిత అధికారులు కూడా తనిఖీలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నరహరి, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

దేశంలోనే ఏపీ మెప్మా ప్రథమస్థానం

- ఎండీ విజయలక్ష్మి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న మెప్మా ఎండీ విజయలక్ష్మి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 10: దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మెప్మా ప్రథమ స్థానంలో ఉందని మెప్మా ఎండీ విజయలక్ష్మి అన్నారు. నెల్లూరు మినీ బైపాస్‌లోని ఓ కల్యాణ మండపంలో బుధవారం రీజినల్ వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, పొదుపు గ్రూపుల ఏర్పాటు, వారికి రుణాలు అందిచటం, ఆర్థిక ప్రయోజనాలు ఏర్పాటు చేయటం... తదితర అంశాల్లో రాష్ట్ర మెప్మా దేశస్థాయిలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. మహిళలకు శిక్షణ ఏర్పాటు చేసి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. మార్కెటింగ్ నైపుణ్యాలను పెంచుతున్నామని తెలిపారు. మెప్మా పీడీ రవీంద్ర మాట్లాడుతూ జిల్లా మెప్మా ద్వారా పొదుపు మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి పలు చర్యలు తీసుకొంటున్నామన్నారు. వివిధ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్లు, స్టేట్ మిషన్ మేనేజర్లు, సీఎంఎంలు, సీవోలు, సీఎల్ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమ్మెను వెంటనే పరిష్కరించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురి డిమాండ్
- ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది..
- మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆగ్రహం



మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (వైద్యం) జనవరి 10: మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీలు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మెను వెంటనే ప్రభుత్వం పరి ష్కరించాలని పలు పార్టీల నేతలు, ప్రజాసంఘాలు కోరాయి. నెల్లూరు నగరంలోని డాక్టర్ జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో బుధ వారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం నేత మాదాల వెంకటే శ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో ఉద్యోగుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. వారి డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలే గాని కక్షసాధింపు చర్యలకు దిగరాదన్నారు. తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీల చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమన్నారు. వారిపై ఎస్మా ప్రయాగం చేయటం అత్యంత దారుణమని చెప్పారు. సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి చంద్రరాజ గోపాల్ మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాద న్నారు. సీపీఐ జిల్లా నేత షాన్‌వాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులతోపాటు అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళనలపై ప్రభుత్వం సానుకూలంగా ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. సమావే శంలో సీపీఎం నేత మోహన్‌రావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు. కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు రమణ, నరసింహ, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు హర్ష, నరేంద్ర, అవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, పౌరహక్కుల సంఘం నేతలు శివశంకర్, యూటీఎఫ్ నేత బాబురెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, బత్తల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 93 మంది గైర్హాజరు

వెంకటాచలం, జనవరి 10 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలలో 93 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలలో ఏడుగురు, మ ధ్యాహ్నం జరిగిన మూడవ సెమిస్టర్ పరీక్షలలో 86 మం ది గైర్హాజరైనట్లు తెలిపారు.

అడ్డగోలుగా నీటి తరలింపు

నెలకు 10 కోట్ల లీటర్లకుపైగానే...

అడుగంటుతున్న భూగర్భ జలాలు

వాల్టా చట్టానికి తూట్లు

ముత్తుకూరు, జనవరి 10 : అభివృద్ధి పేరుతో కృష్ణపట్నం పోర్టుకు అడ్డగోలుగా నీటిని తరలిస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ఒకే ప్రాంతంలో పదుల సంఖ్యలో డీప్ బోర్లతో నీటిని తోడేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. నివాస ప్రాంతాల్లో తాగునీటి లభ్యత క్షీణిస్తోంది. కనీసం వాడుకునేందుకు నీరు లేక ప్రజలు ఇక్కట్లు పడాల్సిన దుస్థితి. మంచినీళ్ల కాస్త ఉప్పునీరుగా మారిపోవడంతో తాగేందుకు నీళ్లు కొనుక్కోవాల్సిన పరిస్థితుల్లో ముత్తుకూరు ప్రజలున్నారు. కృష్ణపట్నం పోర్టు రోజువారీ అవసరాల నిమిత్తం కావాల్సిన నీరు మొత్తాన్ని ముత్తుకూరు పరిసర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్నారు. దాదాపు 60 ట్యాంకర్లతో రోజుకు 250 నుంచి 300 ట్రిప్పుల నీటిని ట్యాంకర్లతో తరలిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు సరాసరిన 12 నుంచి 15వేల లీటర్లు వేసుకున్నా, ప్రతిరోజు 30 నుంచి 40లక్షల లీటర్ల నీటిని తోడేస్తున్నారు. నెలకు దాదాపు 10కోట్ల లీటర్లకుపైగా నీటిని ముత్తుకూరు గ్రామ పరిసర ప్రాంతంలో ఒకే చోట వేసిన 15డీప్ బోర్ల నుంచి తోడేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వాల్టా చట్టప్రకారం ఒకే ప్రాంతంలో రెండు డీప్ బోర్లు ఉండేందుకు కుదరదు. అయితే అధికారులు కనీసం నీటి దోపిడీని అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేయకపోవడం గమనార్హం. భూములను లీజుకు తీసుకుని అందులో డీప్ బోర్లు వేసి ట్యాంకర్‌కు రూ.80లు చొప్పున 15వేల లీటర్ల నీటిని తోడి అమ్మేసుకుంటున్నారు. ఇంత మొత్తంలో ఒకే ప్రాంతంలో నీటిని తోడు వేయడం వల్ల ముత్తుకూరులో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. ఒకప్పుడు బోరు నీరునే తాగేందుకు ఉపయోగించిన ప్రజలు ప్రస్తుతం బోర్లలో వచ్చే నీటిని వాడుకోవడానికి ఆమోదయోగ్యం కానీ దుస్థితి నెలకొంది. మరోవైపు నిత్యం విచ్చలవిడిగా తిరుగుతున్న ట్యాంకర్ల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ట్రాఫిక్ సమస్యలతోపాటు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఉన్నాయి. అభివృద్ధికి సహకరించడంతోపాటు స్థానికులకు సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ముత్తుకూరు ప్రజలు నీటి కరువుతో అల్లాడే ప్రమాదం ఉంది.



పోర్టుకు నీళ్లు తరలిస్తున్న వాటర్ ట్యాంకర్లు

నకిలీ కులధ్రువీకరణ పత్రాలపై విచారణ



క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్న ఆర్డీవో శీనానాయక్

చిట్టగుంట, జనవరి 10: బోగోలు మండలంలో నకిలీ కులధ్రువీకరణ పత్రాలపై కావలి ఆర్డీవో శీనానాయక్ అధ్యక్షతన బుధవారం క్షేత్రస్థాయి విచారణ జరిగింది. గుంజ ఆర్.చంద్రశేఖర్, గుంజ ఆర్.సురేష్, ఆవుల కమలమ్మ తదితరు లు నకిలీ కులధ్రువీకరణ పత్రాలతో తమిళనాడు, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయమై కప్పరాళ్లతిప్ప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో కులపెద్దలు, గ్రామస్థులతో ఆర్డీవో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నల్లబోతుల ధర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి కావాటి శ్రీనివాసులు, ఏపీ ఎరుకుల గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు మొగిలి కల్లయ్య, జిల్లా అధ్యక్షుడు బోగిరి ప్రభాకర్, ఎన్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి పోలయ్యలు నకిలీ కుల ధ్రువపత్రాలను ఆర్డీవోకు చూపించారు. గుంజ, ఆవుల ఇంటి పేర్లతో ఉన్న వారు నకిలీలని వారు అధికారులకు తెలిపారు. ఈ విషయమై తహసీల్దారు హేమంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి విచారణలో కులపెద్దల నుంచి వివరాలు సేకరించి అధికారులకు తెలియ చేస్తామని తెలిపారు. విచారణలో డీటీ డబ్ల్యూవో పరిమళ, బీసీ వెల్ఫేర్ అధి కారి, రెవెన్యూ అధికారులు, ఎరుకుల గిరిజన సంఘాల నేతలు బోగిరి యోహాన్, మల్లి ప్రేమ్‌కుమార్, స్టాలిన్ కుమార్, అరుణమ్మ, బొచ్చు గిరికుమార్, ఆవుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ' గ్రాడ్యుయేషన్ డేకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), జనవరి 10 : నెల్లూరులోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2019-22 బ్యాచ్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు ఫిబ్రవరి మొదటివారంలో గ్రాడ్యుయేష న్ డే నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సదరు విద్యార్థినులు ఒరిజినల్ డిగ్రీ పట్టా పొందేందుకు ఈనెల 19వతేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు www.dkwgdcnellore.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు

నెల్లూరు (విద్య), జనవరి 10 : విజయవాడ స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, డిబేట్, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో గంగాభవాని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం నెల్లూరులోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఉదయం 10, మధ్యాహ్నం 2 గంటల నుంచి వ్యాసరచన పోటీలు జరుగుతాయని తెలిపారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు లక్ష రూపాయలు, రూ.75వేలు, రూ.50వేలు చొప్పున నగదు బహుమతులు అందచేస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పరీక్షకు గంట ముందు పోటీ లు నిర్వహించే ప్రాంతంలో ఆధార్‌కార్డుతో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా వక్తృత్వ పోటీలు

నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రం ప్రాంగణంలో జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు బుధవారం జరిగాయి. ఎన్‌వైకే అధికారి మహేంద్రరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందిన భారత దేశం-2047 అనే అంశంపై జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు ప్రథమ బహుమతి లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.25వేలు అందచేస్తారని తెలిపారు.

సృజనాత్మకత వెలికితీతకే 'ఆడుదాం ఆంధ్రా' : ఎమ్మెల్యే


కావలి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


ఆత్మకూరు: ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కేతా

కావలి, జనవరి 10: పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండల స్థాయి పోటీలను బుధవారం కావలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో కావలి తహసీల్దార్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట: బోగోలు మండలంలో ఎంపీడీవో వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో మండలస్థాయి ఆడదాం ఆంధ్రా ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కావలి ఆర్డీవో శీనానాయక్ బిట్రగుంట రైల్వే క్రీడామైదానంలో క్రికెట్ పోటీలను మండల ప్రత్యేక అధికారి పరిమళతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దారు హేమంత్ కుమార్, ఎంఈవో నరసింహారావు, తదితరులు ఉన్నారు. ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల్లో ప్రారంభమైన వాలీబాల్ పోటీలకు 16 జట్లు పాల్గొనట్లు క్రీడా ఉపాధ్యాయులు షేక్.ఖాదర్, సులోచన తెలిపారు. విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల్లో ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు.

లింగసముద్రం: లింగసముద్రం, పెదపవని గ్రామాల్లోని హైస్కూళ్లలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభమయ్యాయి. క్రికెట్, కబడ్డీ పోటీలను సర్పంచులు పులి రాఘవులు, దామా సీతారామయ్య, ఎంపీడీఓ యు శేషుబాబు, తహసీల్దారు టీ ప్రసాద్‌లు ప్రారంభించారు. మాలకొండరాయునిపాలెం జట్టుపై చినపవని జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ఆ గ్రామ సర్పంచు దామా సీతారామయ్య రూ.5000 అందజేశారు.

వలేటివారిపాలెంలో మొక్కుబడిగా....

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం హైస్కూల్‌లో జరిగిన ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి పోటీలకు స్పందన కరువై మొక్కుబడిగా జరిగాయి. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావల్సిన పోటీలు మధ్యాహ్నం 12 గంటలు దాటినా ప్రారంభం కాలేదు. అధికారులు మైదానాలు సిద్ధం చేసి క్రీడాకారుల కోసం ఎదురుచూశారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల పోటీలకు సుమారు 90 టీంలను ఎంపిక చేశారు. అయితే క్రీడాకారులు రాకపోవడంతో మైదానాలు వెలవెలబోయాయి. మధ్యాహ్నం 12 గంటల తరువాత ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కుబడిగా పోటీలు ప్రారంభించి మమా అనిపించారు.

ఆత్మకూరు: ఆడుదాం ఆంధ్రా రెండవ విడత మండల స్థాయి క్రీడా పోటీలను మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పలు సచివాలయాల జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎస్ఆర్‌జెడీ క్రీడా ప్రాంగణంలో జరిగిన క్రికెట్ పోటీల్లో కరటంపాడు జట్టు విజయం సాధించింది. ఈ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగుతాయని ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. వ్యాఖ్యాతగా మహిమలూరు పంచాయతీ కార్యదర్శి పి భాస్కర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, పీడీలు పి తిరుపతయ్య, షరీఫ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంపీడీవో గోపీ ప్రారంభించారు. వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

ఉదయగిరి: గ్రామీణ ప్రాంత యువతీ, యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్ అన్నారు. బుధవారం ఉదయగిరిలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకటయ్య, సర్పంచ్ సామ్రాజ్యం, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఎంఈవో శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, వార్డెన్ బాషసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు వెంకటయ్య, ఆజాద్, ఎంపీడీవో సాయిప్రసాద్, తహసీల్దారు రామ్మోహన్, నాయకులు ఎల్‌పీ మాలకొండారెడ్డి, జయసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు : స్థానిక క్రీడా మైదానంలో బుధవారం ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. తొలుత కబడ్డీ పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను ఇన్‌చార్జ్ ఎంపీడీవో భార్గవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మండలంలో సీతారామపురం, అయ్యవారిపల్లిలో ఏర్పాటు చేసిన క్రీడామైదానాలలో వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల జెసిఎస్ కన్వీనర్ మాబయ్య, మాజీ ఎంపీటీసీ రామిశెట్టి తిరుపతయ్య, మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి పిడతల ఓబులేసు, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ రమేష్, పీఈటీ ప్రసాద్, గుర్రం సుబ్బయ్య, ముతు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు పండించాలి


పొగాకు పంటను పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్

మర్రిపాడు, జనవరి 10: డీసీపల్లి పొగాకు బోర్డును బుధవారం చైర్మన్ యశ్వంత్‌కుమార్ సందర్శించారు. రైతులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన పొగాకు పండించాలని, రైతు సంక్షేమానికి బోర్డు అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం డీసీపల్లి, గుండెమడకల గ్రామాల్లో పొగాకు పంటలను పరిశీలించారు. ఆయన వెంట వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్, రైతుసంఘం నాయకులు నరసపనాయుడు ఉన్నారు.

వంద రోజుల్లో వైసీపీ పతనం

ఉదయగిరి రూరల్, జనవరి 10: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వంద రోజుల్లో పతనం కాబోతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబుయాదవ్ పేర్కొన్నారు. బుధవారం తన నివాసంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో పేదల జీవనం దుర్భరంగా మారిందన్నారు. వైసీపీని శాశ్వితంగా ఇంటికి పంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జరగనున్న ఎన్నికల్లో టీడీపీ 160 సీట్లు కైవసం చేసుకొని చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో యాప్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం

ఆత్మకూరు, జనవరి 10 : యాదవ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (యాప్) రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఆత్మకూరు పట్టణంలో ప్రాంతీయ కార్యాలాయాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ పిట్టి మల్లికార్జునరావు, యాప్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల కొండయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాదాల వెంటరాజేష్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెవుల రామచంద్రయ్య, గౌరవ సలహాదారులు గంగుల మధుసూధన్‌రావు, యాదవ భవన్ ట్రస్ట్ చైర్మన్ బొమ్మి నాగకిషోర్, ఆనంగి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

సీతారామపురం, జనవరి 10 : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని బసినేనిపల్లి గ్రామంలో ఎంఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ట్రస్ట్ అధినేత బీజేపీ నాయకుడు ముడమాల రమేష్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.15వేలు, రెండవ బహుమతి రూ.8వేలు అందించడం జరుగుతుందని, మండలంలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

యర్రబల్లికి బస్సు నడపండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 10: నెల్లూరు ఆర్టీసీ 1వ డిపో మేనేజర్ మురళీకృష్ణ బుధవారం చేపట్టిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఇద్దరు ప్రయాణికులు ఫోన్ చేసి వారి సమస్యలు తెలిపారు. చేజర్ల మండలం యర్రబల్లి గ్రామానికి నాలుగేళ్లుగా బస్సు సౌకర్యం లేదని, కనీసం రోజుకు రెండు ట్రిప్పులైనా బస్సు నడపాలని గ్రామస్థుడు కుమార్ కోరారు. స్పందించిన డీఎం సాధ్యాసాధ్యాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నెల్లూరు నుంచి రాపూరుకు రాత్రి 10 గంటలకు నడిపే సూపర్ లగ్జరీ బస్సు స్థానంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడపాలని పొదలకూరుకు చెందిన పీ జిలానీ ఖాన్ కోరారు. ఈ సమస్య రాపూరు డిపోకు సంబంధించినది కనుక వారి దృష్టికి తీసుకువెళతానని మురళీకృష్ణ సమాధానమిచ్చారు.

శబరిమలకు తరలిన అయ్యప్పలు

ఉదయగిరి, జనవరి 10: స్థానిక శివాలయంలో బుధవారం అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమం జరిగింది. అనంతరం ఊరేగింపుగా శబరిమలైకు బయలుదేరారు.

రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీని సాగనంపుదాం


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు

ఉదయగిరి రూరల్, జనవరి 10: రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని శాశ్వతంగా సాగనంపుదామని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పిలుపు నిచ్చారు. బుధవారం ఉదయగిరి పట్టణం యాదవవీధిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబుయాదవ్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు వికాస్‌హరికృష్ణలతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజాదీవెన యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు(ఘన) ఆధ్వర్యంలో వైసీపీ నాయకుడు ఉప్పుటూరి వెంకటయ్య, మత్స్యకారులు వారి అనుచరులతో కలిసి 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి బొల్లినేని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే తొలుత ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతోపాటు పట్టణంలో సమస్యలు పరిష్కరిస్తానన్నారు. 2024లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాసులు సందానీ, సజిల్, మాబాషా, గూడూరు వెంకటేశ్వరరావు, ఖాన్‌షా తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరంధామిరెడ్డి

వరికుంటపాడు, జనవరి 10: కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయాల్సిన అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి గైర్హాజరవడంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంద్రా పరంధామిరెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి రోజు బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి కూడా పలు శాఖల అధికారులు నిర్లక్ష్యవైఖరి అవలంబించడం ఎంతవరకు సమంజసమన్నారు. అలాంటి వారిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. అనంతరం క్యాలెండర్లు, ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు, ఉజ్వల గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వైనారూత్, సీనియర్ అసిస్టెంట్ సీతారామాంజనేయులు, సీహెచ్‌వో రాజశేఖర్‌రాజు, బ్యాంకు మేనేజర్ శోభన్‌బాబు, పశు వైద్యాధికారి రాఘవేంద్ర, నారాయణరెడ్డి, గ్యాస్ నిర్వాహకులు ఓబయ్య, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలువాయి : మండలంలోని బాలాజీరావుపేటలో బుధవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు పాల్గొని ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రసాద్, ఎంపీడీవో గోవర్ధన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో మధులత

ఆత్మకూరు, జనవరి 10 : రక్తదాతలు స్ఫూర్తిప్రదాతలుగా నిలిచి పలువురికి ప్రాణదానం చేస్తున్నారని ఆర్డీవో కె మధులత, జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె శేషారత్నం అన్నారు. సామాజిక న్యాయ మహాశిల్పం కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో బుధవారం జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. మాట్లాడుతు రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్‌బాబు, ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌బాబు, డాక్టర్ అస్మా, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చంద్రా వెంకటసుబ్బానాయుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ సాదిక్‌హుస్సేన్, పలువురు రెడ్‌క్రాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

వరికుంటపాడు, జనవరి 10: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి ఇంటర్వ్యూలు నిర్వహించారు. పెద్దిరెడ్డిపల్లి, కాంచెరువు, వరికుంటపాడు, గణేశ్వరాపురం, విరువూరు, నార్త్‌కృష్ణంరాజుపల్లి, తిమ్మారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఖాళీగా ఉన్న 25 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి : ఉదయగిరి ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ప్రయాణికులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959225095 నెంబర్ ద్వారా సూచనలు, సలహాలు, ఇబ్బందులను తెలియచేయాలని ఆయన కోరారు

ఆత్మకూరు : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారుల బృందం పాల్గొంటారని, ఆత్మకూరు ప్రాంత ప్రజలు, ప్రయాణికులు సలహాలు, సూచనలు, ఫిర్యాదులను 9959225645 ఫోన్‌చేసి తెలియజేయాలని కోరారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మంచినీటి పైపులైన్ పగిలిందా?

● రోడ్డుపై మురుగు నీరు నిల్వ ● ప్రమాదాల బారిన ప్రజలు


విద్యుత్ సబ్‌స్టేషన్ బజారులో రోడ్డుపై నీరు

కావలి, జనవరి 10: కావలి పట్టణం వెంగళరావునగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ పక్క వీధిలో రోడ్డుపై నీరు పారుతుండటంతో రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. అక్కడ రోడ్డుపైకి నీరు ఎక్కడ నుంచి వస్తుందో అర్థంకావడంలేదని స్థానికులు చెబుతున్నారు. మంచినీటి సరఫరా సమయంలో నీరు ఎక్కువగా రోడ్డుపై పారుతుండటం నీటి సరఫరా ఆగిన తర్వాత ఆగిపోతుండటంతో మంచినీటి పైపులైన్ పగిలి ఆ నీరు మురుగు నీటిలో కలిసి రోడ్డుపైకి వస్తుందనే అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా ఆగిపోయిన తర్వాత ఆ మురుగు నీరంతా పైపులైన్‌లోకి వెళ్లి మంచినీరు కలిషితగా వస్తుందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుపైకి వస్తున్న నీరు నిల్వ చేరి రోడ్డుపై పాచి పట్టి అక్కడ రాకపోకలకు వాహనచోదకులతోపాటు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా వారు అక్కడకు వచ్చి చూచి పోతున్నారే కానీ ఆ నీరు ఎలా వస్తుంది.. ఎక్కడ నుంచి వస్తుందో నిర్ధారించలేక పోతున్నారు. అక్కడ డ్రైనేజీ నిర్మాణం కోసం కంకర తోలారు. దాని నిర్మాణం త్వరగా చేపడితే మురుగు నీటిలో పైపులైన్ నీరు ఎక్కడ కలుస్తోందో అర్థమవుతోంది. లేదంటే ఆ ప్రాంతంలో ఉన్న ప్రధాన పైపులైన్ తవ్వి లీకేజీని గుర్తించి దానిని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నైపుణ్యాలే విద్యార్థి భవితకు మార్గదర్శకం

కందుకూరు, జనవరి 10: ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ లాంగ్వేజెస్‌లో కనీస నైపుణ్యాలు సాధిస్తే ఉద్యోగాలకు కొదువలేదని మైక్రాన్ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సందీప్ వెల్లడించారు. ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో వారం రోజులుగా డీకోడ్ సాఫ్ట్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో 3వ సంవత్సరం ఈసీఈ, ఈఈఈ విద్యార్థులకు జరుగుతున్న వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో బుధవారం ముఖ్య విశ్లేషకుడిగా సందీప్ పాల్గొని సందేశమిచ్చారు. కార్యక్రమంలో కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్ శ్రీనివాస్, కళాశాల అకడమిక్ ఇన్‌చార్జి ఎస్ఎం మీరావలి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

వలేటివారిపాలెం, జనవరి 10 : మండలంలోని అంకభూపాలపురంలో సర్పంచు ప్రగడ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలోని వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. అంతేగాకుండా సైడు కాలువలలో పూడిక తీయించి మురుగు నీరు నిల్వ లేకుండా చేపట్టారు. మురుగుకుంటలలో బ్లీచింగ్ చల్లించారు.

వీధిలైట్లకు మరమ్మతులు

వలేటివారిపాలెం, జనవరి 10 : మండలంలోని అంకభూపాలపురం, నేకునాంపురం గ్రామాలలో వీధిలైట్లు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని సర్పంచులు ప్రగడ ఆదిలక్ష్మి, కొల్లూరి లక్ష్మమ్మలు బుధవారం వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

దగదర్తి(బిట్రగుంట), జనవరి 10: దగదర్తి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జాతీయ ఉపాధి హామీ పథకం 2022-23లో జరిగిన పనులపై బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ వెంకట్రావు, ఎంపీపీ తాళ్లూరి వెంకటకృష్ణప్రసాద్ నాయుడు, ఏపీడీవో మృదుల పాల్గొన్నారు. ఏడాది కాలంలో జరిగిన పనులపై తనిఖీ బృందం ఇచ్చిన నివేదిపై చర్చించారు. కార్యక్రమంలో విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారి వేణుగోపాల్, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలకు భారీ ఏర్పాట్లు

అల్లూరు, జనవరి 10 : రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు స్వగ్రామం ఇస్కపల్లిలో ప్రతి ఏటా నిర్వహించే సంక్రాంతి సంబరాలను ఈ ఏడాది కూడా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఎప్పటిలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసేందుకు భారీ ఏర్పాట్లు చేపట్టినట్లు బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మురళి తెలిపారు. యువతను అలరించేందుకు సినీ ప్రముఖులతో మ్యూజికల్ నైట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా బుధవారం యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించారు.

అగ్ని బాధితులకు పరామర్శ

కొండాపురం, జనవరి 10: సాయిపేట పంచాయతీ ఇస్కపాలెంలో అగ్నిప్రమాదంలో తగలబడిన గడ్డివాముల బాధితులు గణిపనేని కొండబాబు, గణిపనేని మధులను ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు బుధవారం పరామర్శించారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్‌తో మాట్లాడి నష్టం వివరాలను జిల్లా కలెక్టరుకు నివేదించాలని కోరారు. కలెక్టరుతో మాట్లాడి బాధిత రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం, క్రిష్టయ్య, రైతు కార్యదర్శి పోలినేని రమేష్, గుడవళ్లూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు కుంకు మోహనరావు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, నాయకులు చెరుకూరు వెంకటాద్రి, నర్రా చెంచునాయుడు

పోలేరమ్మకు చల్ది సమర్పించిన భక్తులు

కావలిటౌన్ : పాతూరులో నడివీధి పోలేరమ్మ జాతరలో భాగంగా బుధవారం భక్తులు చల్ది, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. మహిళా భక్తులు సాంప్రదాయబద్ధంగా చల్ది, పొంగళ్ల కుండలతో అక్కమ్మ బావి సెంటర్ నుంచి ఊరేగింపుగా పోలేరమ్మ అరుగు వద్దకు చేరుకుని అమ్మవారికి చల్ది సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా పాపిరెడ్డి చెరువుకు సాగనంపారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆచారపు కర్తలు, కార్యనిర్వాహకులు కేతిరెడ్డి రామకోటారెడ్డి, జనిగర్ల మహేంద్ర యాదవ్, ఈతముక్కలు బాలమురళీరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు భిక్షమెత్తుకోవాల్సిందేనా?


భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలిటౌన్, జనవరి 10: ప్రభుత్వ మొండి వైఖరితో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు భిక్షమెత్తుకోవాల్సిందేనా అని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌కిషోర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు తలపెట్టిన సమ్మెలో భాగంగా బుధవారం ఏఐటీయుసీ ఆధ్వర్యంలో కార్మికులు ట్రంకురోడ్డులో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లి అంకయ్య, గుంజి కిషోర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు, యూనియన్ నాయకులు ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 16 రోజుకు చేరింది. కార్మికులు 16 అంకె ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు పెంచలయ్య, కృష్ణమోహన్, యూనియ న్ నేతలు తురకా శీనయ్య, బీ రమేష్, ఓ.రమేష్, పర్సు జేమ్స్, అనురాధ, చిన్నమ్మ, రాజేశ్వరి, వెంకమ్మ, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

కందుకూరు : మున్సిపల్ కార్మికులు 8వ రోజు నిరసన భాగంగా బుధవారం కందుకూరులో పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో కోలాటం ప్రదర్శనతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోలాటంతో పోస్టాఫీసు సెంటర్, ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ల మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఆత్మకూరు : మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు, ఏఐటీయుసీ మున్సిపల్ యూనియన్ నాయకులు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగివచ్చేవరకు అంగన్వాడీల పోరాటం


కందుకూరు సబ్‌కలెక్టరు కార్యాలయం వద్ద..


ఆత్మకూరు : మాట్లాడుతున్న లక్ష్మీపతి


అనంతసాగరం : ఒంటికాలిపై నిరసన

కందుకూరు, జనవరి 10: ఎస్మా లాంటి చట్టాలు ఎన్ని ప్రయోగించినా అంగన్వాడీల పోరాటపటిమకు ఈ ప్ర భుత్వం దిగిరాక తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు పేర్కొ న్నారు. అంగన్వాడీల సమ్మె 30వ రోజుకు చేరిన సందర్భంగా ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మండలాల కు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు బుధవారం కందుకూరు సబ్‌క లెక్టరు కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. కందుకూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని కందుకూరు పట్టణం, రూరల్, వలేటివారిపాలెం మండ లాల కార్యకర్తలు, ఆయాలు స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో జీవీబీ కుమార్, ప్రాజెక్టు లీడర్ సీహెచ్ ఇంద్రావతి, ఎస్కే పద్మజ, బి.మార్తమ్మ, సీహెచ్ పద్మజ, ఎం.పద్మ, డి.రమాదేవి, బి.మార్తమ్మ, కామాక్షి, ప్రసన్న, ఎస్కే అమీరు స్నీషా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సమస్యలు పరిష్కరిం చాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పా టు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయిం చారు. సీపీఎం, సీఐటీయు నాయ కులు జి లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, శిబి రానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మి, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అనంతసాగరం : స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదా లు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్వర్‌బాష, ఆవాజ్ నాయకులు రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి : స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు బుధవారం ఒంటికాలిపై నిలబడి నిరసనను వ్యక్తం చేశారు. తమ సమస్య లను వెంటనే పరిష్కరించాలని, ఎస్మాను తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, ప్రమీలా, మహాలక్ష్మమ్మ, సుబ్బ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు

లింగసముద్రం, జనవరి 10 : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తహసీల్దారు టీ ప్రసాద్ మండలంలోని 45 అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లకు, ఆయాలకు బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను వీఆర్వోలు, సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాల గోడలకు అంటించారు. ఈ నోటీసులలో ప్రభుత్వం గత నెల 12వ తేదీ నుంచి అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు విధులకు హాజరు కావడం లేదని, దీని వలన సేవలలో అంతరాయం ఏర్పడిందని, అందువలన మిమ్ములను ఎస్మా పరిధిలోకి తెస్తూ, మీకు సమ్మె చేసే హక్కు లేదని, మిమ్ములను ఎందుకు తొలగించకూడదో ఈ నోటీసు అందిన 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

ఉలవపాడు : మండలంలోని 148 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు షోకాజ్ నోటీసులు అందచేసినట్లు ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో విజయకుమారి తెలిపారు. స్థానిక రెవెన్యూ అధికారుల ద్వారా నోటీసులు అంగన్‌వాడీ సెంటర్ల వద్ద అంటించి, మరొక కాపీ అందుబాటులో ఉన్న సిబ్బంది చేతికి ఇచ్చామన్నారు. షోకాజ్ నోటీసులు తీసుకోవడానికి ఇష్టపడని అంగన్‌వాడీలు తిరస్కరించడంతో నోటీసులను వారి ఇళ్ల గోడలకు అంటించారన్నారు. 10 రోజుల్లో వివరణ ఇచ్చి విధుల్లో చేరాలని లేని పక్షంలో ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని సంబంధిత అధికారులు హెచ్చరించారు.

బిట్రగుంట : బోగోలు మండలం 30 రోజులుగా సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీ వర్కర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తునట్లు సీడీపీవో సౌజన్య తెలిపారు. మండలంలో 79 అంగన్వాడీలు ఉన్నారన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు కోటేశ్వరి, సుభాషిణి, సుప్రజ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : మండలంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందిచే షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు తహసీల్దారు సానా శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెచేస్తున్న వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని, నోటీసులు తిరస్కరించిన కార్యకర్తలు నిర్ణీత సమయంలోపు వివరణ ఇవ్వాల్సి ఉందన్నారు. మండలంలో ఇప్పటివరకు 43 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తేజస్విని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ'


కరపత్రాలు పంచుతున్న ఇంటూరి, తదితరులు

కందుకూరు, జనవరి 10: పట్టణంలోని మండలపువారి కొష్టాలు, చల్లావారి కొష్టాలు, బిలాల్‌నగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో బుధవారం టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముచ్చు శ్రీను, గట్టమనేని సుబ్బారావు, చల్లా సురేష్, మండలపు గోపి, బోయపాటి శ్రీనివాసరావు, నవిడిబోయిన వెంకటకృష్ణ, చల్లా సురేష్, కొత్తపల్లి సురేష్, చల్లా రమేష్, ఉన్నం మాల్యాద్రి, మున్వర్, పామర్తి సాయి, అమ్మనబోయిన వేణు తదితరులు పాల్గొన్నారు.

జన్ భగీదారీలో భాగంగా రక్తదానం



రక్తదానం చేస్తున్న సబ్‌కలెక్టర్ విద్యాధరి

కందుకూరు, జనవరి 10: అంబేడ్కర్ స్మృతి కార్యక్రమం సందర్భంగా నిర్వహిస్తున్న జన్ భగీదారీలో భాగంగా కందుకూరులో సబ్ కలెక్టరు జి.విద్యాధరి ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకు రాగా సబ్ కలెక్టరు విద్యాధరి సైతం రక్తదానం చేసి స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు, తహసీల్దారు ఆర్.బ్రహ్మయ్య, డీఎల్‌డీఓ పద్మజ, ఎంపీడీఓ విజయశేఖర్, సీఐ హఫీజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూయాజమాన్య చట్టంతో చిక్కులు!


● రైతులకు తప్పని తిప్పలు ● వ్యతిరేకిస్తున్న న్యాయవాదులు

కోవూరు, జనవరి 10: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం (ల్యాండ్ టైటిల్ యాక్టు-2023) వల్ల తీవ్రమైన చిక్కులు తలెత్తనున్నాయని న్యాయవాదులు వాపోతున్నారు. ఈ చట్టం అమలును రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రహస్యంగా ప్రవేశపెట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారని చెబుతున్నారు. చట్టం అమలుకు భూమి సాధికార సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీ సర్వే చేపట్టింది. అయితే ఈ సర్వేతో భూ యజమానికి శాశ్వత హక్కు కల్పిస్తామని, భూ సమస్యలు లేకుండా చర్యలు చేపడుతామని ప్రభుత్వం చెప్పింది. అయితే రీ సర్వే అనంతరం సమస్యలు లేని రైతులకు సైతం కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటిని పరిష్కరించుకోవడం రైతులకు తలకుమించిన భారంగా ఉంది. ఒక సర్వే నెంబరులో ఎంత మంది భూమిని కలిగి సబ్ డివిజన్ చేసుకుని ఉంటారో వారందరికీ జాయింట్ ఎల్‌పీఎంతో పట్టాదారు పాస్‌పుస్తకం ఇచ్చారు. దీనిని పరిష్కరించుకోవడం రైతులకు సాధ్యం కావడం లేదు. మొత్తంగా ఈ భూమి ఎవరదన్నది స్పష్టత లేకుండా పోతోంది. అలాగే పొలాన్ని ఆక్రమించాలనుకున్న అక్రమార్కుల్ని రెవెన్యూ వ్యవస్థ, భూమి సాధికార సంస్థల్లో ఎదుర్కోవడం చాలా కష్టం. దీనిలో అధికార పక్ష నాయకుల హవా కొనసాగుతోంది. ఆక్రమణలపై న్యాయస్థానాల్ని ఆశ్రయించే వీలులేకుండా భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రూపొందించారు. భూ హక్కు కలిగిన రైతు తమ సమస్యలను రెవెన్యూ, భూమి సాధికార సంస్థల్లో ఫిర్యాదు చేయాలి. అక్కడ న్యాయం జరగకపోతే ఏకంగా హైకోర్టుకు వెళ్లాలి. స్థానిక సివిల్ కోర్టులకు విచారణాయోగ్యత లేకుండా చట్టం చేయడంపై జిల్లాలోని న్యాయవాదులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. కోర్టు విధుల్ని బహిష్కరించి ఆందోళనలు సాగిస్తున్నారు.



పట్టాదారు పాస్‌బుక్

ఆస్తులకు భద్రత లోపించనుంది



భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల రైతులు తీవ్రమైన సమస్యను ఎదుర్కోనున్నారు. ఈ చట్టం వల్ల ఆస్తులకు భద్రత లోపించనున్నది. ప్రజావ్యతిరేక యాక్టుకు వ్యతి రేకంగా మేము ఆందోళన సాగిస్తున్నాం. ఆందోళనలో రైతుల్ని భాగస్వామ్యం చేయాలనుకుంటున్నాం.

- సీహెచ్ వంశీధర్‌రెడ్డి, అధ్యక్షుడు , న్యాయవాద సంఘం, కోవూరు.

రాబంధుల చేతుల్లోకి..



పేదల భూములు భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల రాబంధుల చేతుల్లోకి పోనున్నాయి. పేదల భూమి, ప్రభుత్వం భూముల్ని పలుకుబడిన కల్గిన వ్యక్తులు ఆక్రమిస్తే న్యాయం దక్కదు. దుర్మార్గమైన చట్టాన్ని వ్యతి రేకించపోతే భవిష్యత్తు తరాలకు తీరని నష్టం వాటి ల్లుతుంది.

- బాబు, ప్రధానకార్యదర్శి, న్యాయవాద సంఘం, కోవూరు

తీరని అన్యాయం



భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల పేద రైతులకు తీరని అన్యాయం జరగనుంది. పేదల ఆస్తుల్ని భక్షించేందుకు వీలుగా భూ యాజ మాన్య హక్కు చట్టం తీసుకువచ్చినట్లుగా కన్పిస్తోంది. అన్ని వర్గాల వారు ఈ భూ యాజమాన్య హక్కు చట్టం అమలు కాకుండా అడ్డుకోవాల్సి ఉంది.

- చిన్ని పోలయ్య , రైతు, కోవూరు

గ్రామాభివృద్ధి ప్రణాళికలు పక్కాగా ఉండాలి

నెల్లూరు (జడ్పీ), జనవరి 10 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాలను అభివృద్ధి చేయడం కోసం పక్కాగా ప్రణాళికలను తయారు చేయాలని అధికారులను జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆదేశించారు. జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీ శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు ఉండాలన్నారు. గ్రామ, మండల పరిషత్ కార్యాలయాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో సుస్మిత, పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ● నేడు 'అంబేడ్కర్' ఎగ్జిబిషన్లు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 10 : రక్తదానం చేస్తే ప్రాణ దానం చేసినట్లేనని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో సామాజిక సమతా సంకల్పంలో భాగంగా జిల్లా యంత్రాంగం, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఎన్జీవో హోంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని అరుణమ్మ ప్రారంభించి ప్రసంగించారు. అన్ని దానాల్లో కెల్లా రక్తదానం ఎంతో గొప్పదని, ప్రాణాలు కాపాడే శక్తి ఒక్క రక్తదానానికే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, మేయర్ స్రవంతి, డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, జన్‌బాగీదరి కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ జీవిత విశేషాలతో గురువారం ఫొటో, బుక్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామని జేసీ కూర్మనాథ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో, మధ్యాహ్నం 4 గంటలకు చిల్డ్రన్స్ పార్కులో ఈ ప్రదర్శన ఉంటుందని తెలిపారు.



రక్తదాన శిబిరంలో ఆనం అరుణమ్మ

నగరాభివృద్ధి నారాయణతోనే సాధ్యం

● నారాయణ సతీమణి రమాదేవి

నెల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర అభివృద్ధి ఒక్క నారాయణతోనే సాధ్యమని మాజీ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి స్పష్టం చేశారు. బుధవారం చిల్డ్రన్స్ పార్కు, పెద్ద బజారు ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ-జనసేన నేతలతో కలిసి ఆమె ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని ఆదరించాలని అభ్యర్థించారు. నగరంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఈ దఫా నారాయణను గెలిపించుకుంటామని ప్రజలు చెబుతుండడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు.



మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రమాదేవి

నారాయణ చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 10 : టీడీపీ హయాంలో మంత్రి నారాయణ నగరంలో చేసిన అభివృద్ధే వచ్చే ఎన్నికల్లో ఆయనను గెలిపిస్తుందని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. నగరంలోని 47వ డివిజన్ గుప్తాపార్కు సెంటర్, నారాయణరావు పేట ప్రాంతాల్లో బుధవారం మహాశక్తి, భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. క్రైం క్యాపిటల్‌గా మారిన నెల్లూరు తిరిగి ప్రశాంతంగా మారాలంటే నారాయణ రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ గణేష్‌కుమార్, అబ్దుల్ రెహమాన్, కల్వకుంట భాస్కర్, కంచి రాధాకృష్ణ, వీరమల్లు చంద్ర, పద్మాబాయి, పవిత్ర, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరుపల్లిలో కోటంరెడ్డి కుటుంబీకుల ప్రచారం

నెల్లూరు రూరల్, జనవరి 10 : నెల్లూరు రూరల్ నియోజకవర్గం కల్లూరుపల్లిలో బుధవారం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కుటుంబీకులు ప్రచారం నిర్వహించారు. ఆయన సతీమణి సుజిత, కుమార్తెలు వైష్ణవి, హైందవి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందచేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి చంద్రబాబును సీఎం చేయాలని, శ్రీధర్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వాత్సల్య' విద్యార్థులకు దుస్తుల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), జనవరి 10 : నగరంలోని వాత్సల్య అనాథ శరణాలంలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం ప్రైవేటు ఉద్యోగులు, సేవాతత్పరత కలిగిన కొందరు నూతన దుస్తులను వితరణ చేశారు. వీటిని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ షేక్ ఖాదర్‌వలీ విద్యార్థులకు అందచేశారు. ఆయన మాట్లాడుతూ ఆశ్రమ బాలలకు సంక్రాంతి సందర్భంగా దుస్తులు బహూకరించడం ప్రశంసనీయమన్నారు. ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్ రావు మాట్లాడుతూ 'వాత్సల్య' విద్యార్థులు చదువు, ఆటపాటల్లో రాణించడంతోపాటు ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించేలా సంస్థ ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయ వర్మ, ఆరోగ్యశాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్వం శ్రీనివాసులు, సేవా టీం నిర్వాహకురాలు పరిమళ, ఆర్ ఇందిర, షేక్ ఖాదర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 10 : నగరంలో పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో బుధవారం మార్గశిర మాస శివరాత్రిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం జగద్గురు ఆదిశంకర దత్తాత్రేయ మహా సంస్థానం పీఠాధిపతి విద్యా నృసింహ భారతి స్వామి విచ్చేసి భక్తులకు అభిభాషణం చేశారు. ఆదిశంకరాచార్యులు అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేశారని, ఇందుకోసం చతురామ్నాయ పీఠాలతోపాటు అనుత్తరామ్నాయ పీఠాలను స్థాపించారని చెప్పారు. ఆ 18 పీఠాల అధిపతులను మాత్రమే జగద్గురువులుగా సంబోధించాలని కోరారు. ఈ సందర్భంగా ఆదిశంకరాచార్యులకు ప్రత్యేక పూజలు జరిపారు. ధ్యాన మందిరం మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, సమయానందనాథ స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆదిశంకరులకు హారతి ఇస్తున్న నృసింహ భారతి స్వామి

ఆ పిల్లలను బడిలో చేర్చండి!

నెల్లూరు (వైద్యం), జనవరి 10 : చెత్త కాగితాలు ఏరుకునే ఇద్దరు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు వారిని బడిలో చేర్చాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కే వాణి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ, కార్మిక శాఖ, మానవ అక్రమ రవాణా నివారణ బృందాలు సంయుక్తంగా బుధవారం నగరంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాయి. వేదాయపాళెం వద్ద చెత్త ఏరుకుంటున్న ఇద్దరు చిన్నారులను గుర్తించిన సీనియర్ సివిల్ జడ్జి వాణి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ చిన్నారులను మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఏఎస్ఐ సతీష్ బాబు, హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి, బాలల సంరక్షణ అధికారి సురేష్, కార్మిక శాఖ అధికారి శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రంగడి ఆలయంలో ధనుర్మాస పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 10 : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం తిరుప్పావై పాశురగానం, ప్రత్యేక పూజలు జరిగాయి. గురువారం ఉదయం ప్రాకారోత్సవం జరుగుతుందని, శుక్రవారం ఉదయం ప్రాకారోత్సవం, తిరుమంజనం సేవలు జరుగుతాయని ఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా, బుధవారం ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, తిరుపతి టాస్క్‌ఫోర్స్ అధికారి సీహెచ్ శ్రీనివాసులు కుటుంబం రంగనాథస్వామిని దర్శించుకుంది. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● మూలాపేట వేణుగోపాలస్వామిని నెల్లూరు ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జిల్లా సెషన్స్ న్యాయాధికారి కపర్దీ దంపతులు దర్శించుకున్నారు. తొలుత గోశాలలో గోవులకు పూజ చేశారు. ఆలయ సహాయ కమిషనర్ దాసరి చంద్రశేఖరరావు, సిబ్బంది పాల్గొన్నారు.





రంగడి ఆలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య కుటుంబం, గోపూజలో న్యాయాధికారి కపర్ది

వావిలేటిపాడు శ్మశానం పరిశీలన

నెల్లూరు(సిటీ), జనవరి 10 : నెల్లూరు రూరల్లోని 12వ డివిజన్ వావిలేటిపాడులో గల హిందు శ్మశాన వాటికను నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ బుధవారం పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ఆధునీకరణలో భాగంగా శ్మశానాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. రికార్డులు పక్కాగా ఉండాలి, వాటి మేరకు హద్దులు స్పష్టంగా ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీసీపీ దేవీకుమారి, రూరల్ తహసీల్దారు సోమ్లా నాయక్, సర్వేయర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. కాగా, చింతారెడ్డిపాళెం, పోలీసుకాలనీ, లక్ష్మీసాయినగర్ ప్రాంతాల్లోని సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

యర్రబల్లికి బస్సు నడపండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 10: నెల్లూరు ఆర్టీసీ 1వ డిపో మేనేజర్ మురళీకృష్ణ బుధవారం చేపట్టిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఇద్దరు ప్రయాణికులు ఫోన్ చేసి వారి సమస్యలు తెలిపారు. చేజర్ల మండలం యర్రబల్లి గ్రామానికి నాలుగేళ్లుగా బస్సు సౌకర్యం లేదని, కనీసం రోజుకు రెండు ట్రిప్పులైనా బస్సు నడపాలని గ్రామస్తుడు కుమార్ కోరారు. స్పందించిన డీఎం సాధ్యాసాధ్యాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నెల్లూరు నుంచి రాపూరుకు రాత్రి 10 గంటలకు నడిపే సూపర్ లగ్జరీ బస్సు స్థానంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడపాలని పొదలకూరుకు చెందిన పీ జిలానీ ఖాన్ కోరారు. ఈ సమస్య రాపూరు డిపోకు సంబంధించినది కనుక వారి దృష్టికి తీసుకువెళతానని మురళీకృష్ణ సమాధానమిచ్చారు.

మనస్తాపంతో బేల్దారి బలవన్మరణం

నెల్లూరు రూరల్, జనవరి 10 : భార్య కాపురానికి రావడం లేదన్న కారణంగా మనస్తాపానికి గురై ఓ భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. రూరల్ పోలీసులు అందించిన వివరాలు మేరకు... నగరంలోని వడ్డిపాళెంకు చెందిన గుత్తి పెంచల నరసయ్య (33) బేల్దారి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా భార్య అతనిపై అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమెను ఎన్నిసార్లు బతిమిలాడినా కాపురానికి రాకపోవడంతో ఆవేదన చెంది రెండు రోజుల క్రితం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'నైతిక పదాల నానీలు' ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 10 : సామాజిక చైతన్యం కోసం సాహిత్యంలోని నానీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పెన్నా రచయితల సంఘం అధ్యక్షుడు అవ్వారు శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం టౌనుహాలు వర్ధమాన సమాజంలో బుచ్చికి చెందిన కవి తిప్పావఝల నరసింహమూర్తి రాసిన నైతిక పదాల నానీ పుస్తకంపై ఆయన సమీక్షోపన్యాసం చేశారు. ఆ పుస్తకాన్ని విజిలెన్స్ డీఎస్పీ కొల్లూరు శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం రచయిత దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెరుగు రామకృష్ణ, సోమిరెడ్డి జయప్రద పాల్గొన్నారు.

13 నుంచి సంక్రాంతి సంబరాలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 10 : సింహపురి సంక్రాంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 13, 14, 15తేదీలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు బీఎస్ రంగరాజన్ తెలిపారు. ఆ సమితి సమావేశం బుధవారం టీపీఎస్ కల్యాణ సదన్‌లో జరిగింది. ఉత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించి ప్రజలు అందరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ కల్యాణ సదన్ మేనేజింగ్ ట్రస్టీ డీ ఫణిరత్నం, ఏపీ కైట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మిడతల రమేష్, కేవీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులూ.. వాస్తవాలు గ్రహించాలి!

● సన్నపురెడ్డి పెంచలరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 10 : అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికులకు వేతనాలను వైసీపీ ప్రభుత్వం పెంచిందని, వారు వాస్తవాలను గమనించాలని వైసీపీ సీనియర్ నాయకుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొంతమంది కార్మికులను రెచ్చగొట్టి ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. మరోసారి జగన్ అధికారంలోకి రావటం ఖాయమన్నారు.

నేడు న్యాయవాదుల మానవహారం

నెల్లూరు (లీగల్), జనవరి 10 : ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ -2023కి వ్యతిరేకంగా న్యాయవాదులు చేస్తున్న ఆందోళనలో భాగంగా గురువారం ఉదయం 11:30 గంటలకు మానవహారం నిర్వహించనున్నట్లు న్యాయవాదుల ఉద్యమ కార్యాచరణ కమిటీ కన్వీనర్ ఎం బ్రహ్మం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో సామూహిక నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), జనవరి 10: నగరంలోని వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలో దర్గామిట్ట ఫీడర్‌కు కండక్టర్లు మారుస్తున్నందున గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అరవిందనగర్, శోధన్‌నగర్, ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని తెలిపారు.

బీఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ముత్తుకూరు, జనవరి 10 : బీ ఫార్మసీ కోర్సుతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని రత్నం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రపూర్ణచంద్ర తెలిపారు. బుధవారం పిడతాపోలూరులోని రత్నం ఫార్మసీ కళాశాలలో బిగ్ బాష్ పేరిట ప్రెషర్స్‌డే వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఫార్మసీ విద్యార్థులకు మెడికల్ రంగంతో పాటు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సుధాకర్‌నాయుడు, ఆర్‌అండ్‌డి హెడ్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు అయోధ్య అక్షితలు

మనుబోలు, జనవరి 10 : మండలంలోని వివిధ గ్రామాల్లో అయోధ్య శ్రీరాముని అక్షితలను ఆలూరు రాము ఆచారి బుధవారం గడపగడపకు పంపిణీ చేశారు. జనవరి 22న ఈ అక్షితలను పెద్దలు, పిల్లలపై వేసి దీవించాలన్నారు. అదే రోజు వాకిళ్ల ముందు ఐదు దీపాలు వెలిగించాలన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సబ్ కన్వీనర్ ప్రభాకర్, మహిళా కన్వీనర్లు బుజ్జమ్మ, వెంకటరమణమ్మ తదితరులున్నారు.

ఎమ్మెల్యే ప్రసన్న పంచేది ప్రజల సొత్తే!

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 10: కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నియోజకవర్గంలో ప్రజలకు పంచేదంతా ఇసుక, గ్రావెల్ మాఫియాలతో దోపిడీ చేసిన రూ.1500 కోట్ల ప్రజాధనమేనని టీడీపీ కోవూరు నియోజకవర్గం ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన బుచ్చి నగర పంచాయతీలోని 14, 15వ వార్డులలో క్లస్టర్ ఇన్‌చార్జిలు బండ్ల కొండయ్య, కిషోర్‌లతో కలిసి ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎంవీ.శేషయ్య, బత్తల హరికృష్ణ, హరనాథ్, చెముకుల చైతన్య, బచ్చాబాయ్, వుసురుపాటి, కళ్యాణ్, శ్రీనివాసులు, నరసింహస్వామి, మంజుల, మీరావలి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చని సభలెందుకు ?

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి 10: సమస్యలు తీర్చకుండా గ్రామ సభలు ఎందుకని రైతులు అధికారులపై ఆగ్రహించారు. మండలంలోని పంచేడు, మినగల్లు గ్రామాల్లో బుధవారం గ్రామసభలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ సుధీర్, వీఆర్వో మోహన్‌రావులపై రైతులు మండిపడ్డారు. ఏం బెదిరిస్తున్నారా... అని తహసీల్దార్ అనడంతో రైతులు ఆయనతో వాగ్వివాదానికి దిగారు. రీసర్వేకు ముందున్న పాసుపుస్తకాలు, రీసర్వేలో కనిపించలేదని, ఒకరి పేరుకు బదులు మరొకరి పేర్లు కనిపిస్తున్నాయని రైతులు పేర్కొన్నారు. రీసర్వే గందరగోళంగా జరిగింద న్నారు. ఇలా పలు సమస్యలను రైతులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాక మినగల్లు లో రైతు అల్లం బాబు, పంచేడుకి చెందిన దివ్యాంగ రైతు తువ్వర పెద రవణయ్య తదితరులు తమ సమస్యలపై అధికారులకు ఏకరువు పెట్టారు.

టీడీపీ నేత 'గంధం' మృతికి సంతాపం

పొదలకూరు, జనవరి 10 : తెలుగునాడు ట్రేడ్ యూనియన్ తిరుపతి పార్లమెంటు కార్యదర్శి గంధం రమేష్ ఆకస్మిక మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. అనారోగ్య సమస్యతో గంధం రమేష్ బుధవారం మృతి చెందడంతో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, టీడీపీ నాయకులు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, శ్రీనివాసులు, కృష్ణయాదవ్, నాయకులు, కార్యకర్తలు సంతాపం ప్రకటించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

● నెల్లూరు ఆర్డీవో మలోల

మనుబోలు, జనవరి 10: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని నెల్లూరు ఆర్డీవో మలోల అన్నారు. మనుబోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. తొలిరోజు 19 టీమ్‌లు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, షటిల్ పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, ఏవో రవికుమార్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఈవోపీఆర్డీ కృష్ణవేణి, మనుబోలు సర్పంచ్ కంచి పద్మమ్మ, ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, వైసీపీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, ముంగర రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో మలోల

దోచుకోవడం, దాచుకోవడమే కాకాణి పని

పొదలకూరు, జనవరి 10 : దోచుకోవడం, దాచుకోవడమే వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పని అని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఊట్లపాలెం, దుగ్గుంట ఎస్సీ కాలనీలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ మంత్రి కాకాణి తన బినామీ పేర్లతో 2300 ఎకరాల భూములు ధారాదత్తం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, నాయకులు తోట శ్రీనివాసులు, పసల మనోహర్, కప్పల సోమయ్య, తోట భాస్కర్, బొద్దులూరు మల్లికార్జుననాయుడు, పులిపాటి వెంకటరత్నం నాయుడు, అక్కెం సుధాకర్‌రెడ్డి, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న సోమిరెడ్డి

ఎన్నికల్లో మంత్రి కాకాణి ఓటమి తథ్యం

వెంకటాచలం, జనవరి 10 : రాబో యే ఎన్నికల్లో సర్వేపల్లిలో సోమిరెడ్డి చేతులలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఓటమి తథ్యం అని టీడీపీ మండలాధ్య క్షుడు గుమ్మడి రాజాయాదవ్ జోస్యం చెప్పారు. వెంకటాచలంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి సోమిరెడ్డి పోటీపై కాకాణి, అతని అనుచరులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నుండి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోటీచేసి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. కాకాణికి డిపాజిట్లు కూడా రావన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాబోతుందన్నారు. కార్యక్రమంలో నిక్కుదల రమేష్, పఠాన్ ఖాయ్యూమ్ ఖాన్, బదనాదం ఆంతోని, షేక్ సత్తార్ సాహెబ్, నంది రమణయ్య, ఆస్తోటి నాగరాజు, ఆత్మకూరు ఆది, బాణాల నాగేశ్వరరావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న గుమ్మడి రాజాయాదవ్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

రాపూరు (డక్కిలి), జనవరి 10 : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రాపూరులో అంగన్‌వాడీలకు బుధవారం ఆయన మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వైసీపీని ఓడించండి

రాపూరు(డక్కిలి) : వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలని అప్పుడే రాష్ట్రం బాగుపడుతుందని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండలంలోని సిద్దవరం గ్రామంలో పర్యటించి జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలంటూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పోట్లేళ్ల పెంచలస్వామి, మేకల వేమయ్య, జల్లా శ్రీనివాసులు, వెంకీ, వంశీ, శ్రీను, శివ, విజయకుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో వైసీపీ శ్రేణుల సంబరాలు

రాపూరు(డక్కిలి) : గూడూరు వైసీపీ టికెట్ ఎమ్మెల్సీ మేరిగ మురళీకి కేటాయించడంతో ఆయన అభిమానులు, అనుచరులు బుధవారం రాత్రి రాపూరులో సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. కాగా, మేరిగ మురళీ విజయవాడలో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ మురళి

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం : పెనుబల్లి దళితవాడలో బుధవారం ఇంటి ముందున్న వృద్ధురాలిపై ఓ యువకుడు డిష్ అబ్బాయినంటూ నమ్మించి దాడి చేసి మెడలో ఉన్న రెండున్నర సవర్ల బంగారు చైన్ లాక్కెళ్లాడు. బాధితురాలు నన్నం బుజ్జమ్మ కేకలు వేయడంతో స్థానిక యువకులు గుర్తుతెలియని వ్యక్తిని పట్టుకునేందుకు కొంతదూరం వెంబడించినా ప్రయోజనం లేకపోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ బి.మహేంద్ర బాధితురాలిని విచారించారు.

గూడూరు వైసీపీ సమన్వయకర్తగా ఎమ్మెల్సీ మేరిగ



గూడూరు, జనవరి 10 :గూడూరు వైసీపీ అభ్యర్థిత్వంపై చాలాకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఇక్కడినుంచి పలువురు అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న పరిస్థితుల్లో వైసీపీ ఇన్‌చార్జిగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధరరావు పేరును పార్టీ ఖరారు చేసింది.ఈ నేపథ్యంలో మేరిగ బుధవారం ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ అంగన్వాడీ ఉద్యోగుల నిరసన

వేతనాలు పెంచకుంటే

మట్టి తిని బతకాలా?

తిరుపతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఉద్యోగులు ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు కొనసాగించారు. సత్యవేడులో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగించిన ఉద్యోగులు చేతుల్లో మట్టి వుంచుకుని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు ఇవ్వకుంటే తాము మట్టి తిని బతకాలా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తిరుపతిలో అంగన్వాడీ ఉద్యోగులకు మద్దతుగా అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఉద్యోగులపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని, అలాగే కనీస వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయుడుపేటలో అంగన్వాడీ మహిళలు కళ్ళకు గంతలు కట్టుకుని రిలే నిరాహార దీక్షలు కొనసాగించగా పుత్తూరులో రిలే దీక్షలు చేపట్టిన ఉద్యోగులకు టీడీపీ నాయకులు మద్దతు ప్రకటించడంతో పాటు రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సూళ్ళూరుపేటలో అంగన్వాడీ ఉద్యోగులు సమ్మెలో భాగంగా ధర్నా నిర్వహించగా సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించి పాల్గొన్నారు. గూడూరు కోట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, పిచ్చాటూరు, రేణిగుంట, చంద్రగిరిల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఆయా ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు.



సత్యవేడులో అంగన్వాడీ ఉద్యోగుల నిరసన

డీఐఈవో బాధ్యతల స్వీకారం



డీఐఈవో స్వర్ణలతను అభినందిస్తున్న ఉద్యోగులు

తిరుపతి(విద్య), జనవరి 10 : ఇంటర్ బోర్డు జిల్లా విద్యాశాఖాధికారి(డీఐఈవో)గా ఎ.స్వర్ణలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నాగలాపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఈమెను జిల్లా ఎఫ్ఏసీ అధికారిగా నియమిస్తూ ఇంటర్ బోర్డు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేసి ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పలువురు ఉద్యోగులు ఆమెను సన్మానించారు. కాగా ఇంతకుముందు డీఐఈవోగా పనిచేసిన విశ్వనాథ నాయక్ తిరిగి చిన్నగొట్టిగల్లు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్నారు.





పుదుచ్చేరి మద్యం పట్టివేత

బాపట్ల జిల్లావాసి అరెస్టు



పట్టుబడ్డ మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజగోపాలరెడ్డి

తడ, జనవరి 10: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న పుదుచ్చేరి రాష్ట్ర మద్యాని పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు భీములవారిపాళెం చెక్‌పోస్టు సమీపంలో పోలీసు, డీఎస్పీ, ఎక్సైజ్, రవాణాశాఖ అధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోకి వచ్చే అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి చెన్నై నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు చెక్‌పోస్టు వద్ద ఆగింది. అందులో నుంచి కిందకు దిగిన ఓ వ్యక్తి తనిఖీలను చూస్తూ ఖంగారుపడటంతో పోలీసులు అదుపులోకి తీసుకుని అతని లగేజీని తనిఖీ చేశారు. బస్సులో నాలుగు అట్టపెట్టెల్లో దాచిన పుదుచ్చేరి రాష్ట్ర మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిందితుడు బాపట్ల జిల్లా చెరకుపల్లి మండలం రాంబట్లవారిపాళెం గ్రామానికి చెందిన జూపూడి బేటేశ్వరరావుగా గుర్తించారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాలరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఈ మద్యానికి అనుమతి లేదని, పరిమితికి మించి సరఫరా చేస్తుండటంతో అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రైనీ డీఎస్పీ సింధుప్రియ, సీఐ మధుబాబు, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, ఏఎస్ఐ శ్రీకుమార్‌రెడ్డి, సిబ్బంది విజయకుమార్, నాగార్జున, రామయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాకు న్యాయం జరిగేవరకు వెళ్లం

- తహసీల్దారు కార్యాలయం ఎదుట

బైఠాయించిన లోతువానిగుంటవాసులు



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

నాయుడుపేట టౌన్, జనవరి 10: తమకు న్యాయం జరిగేవరకు వెళ్లబోమంటూ లోతువానిగుంట కాలనీవాసులు తహసీల్దారు కార్యాలయం ఎదుట భీష్మించి కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో కాలనీలోకి నీళ్లు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని, ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బియ్యం, రూ.2,500 నగదు కూడా తమకు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి ఎన్నో పర్యాయాలు అధికారులకు చెప్పినా తమకు న్యాయం జరగలేదన్నారు. ఎమ్మెల్యే, తహసీల్దారు వచ్చేంతవరకు ఇక్కడనుంచి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. ఎస్ఐ రఘునాథ్ అక్కడకు చేరుకొని ఎమ్మెల్యే, తహసీల్దారు అందుబాటులో లేరని, వచ్చిన తరువాత మాట్లాడి న్యాయం చేస్తానని చెప్పడంతో లోతువానిగుంట కాలనీవాసులు వెళ్లిపోయారు.

పోలీసులు క్రీడా స్ఫూర్తి పెంచుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఐజీ వెంకటేశ్వర్లు

వెంకటగిరిటౌన్, జనవరి 10: పోలీసులు క్రీడా స్ఫూర్తి పెంచుకుని జీవన శైలి మార్చుకోవాలని కర్నూలు రేంజీ డీఐజీ-3 సీహెచ్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. 9వ బెటాలియన్‌లో గత మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. చివరి రోజు ముఖ్యఅతిథిగా హాజరైన డీఐజీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచి క్రీడల్లో రాణించే దిశగా అడుగులు వేయాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్తేజం, శారీరక ధృడత్వం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కమాండెంట్ ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

జయహో బీసీ సభలను విజయవంతంగా నిర్వహించాలి

గూడూరు, జనవరి 10: నియోజకవర్గంలోని ప్రతిమండలంలో టీడీపీ అధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ, మండల కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు అండగా నిలిచేది టీడీపీయేనన్నారు. ప్రతి మండలంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించి వారి అభ్యున్నతికి టీడీపీ చేసే కృషిని వివరించాలన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, గణపర్తి కిషోర్‌నాయుడు, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, బిల్లు చెంచురామయ్య, గుండాల లీలావతి, ధనుంజయగౌడ్, కృష్ణమూర్తి, బాలకృష్ణ, కస్తూరయ్య, దామోదర్, మునిశేఖర్ పాల్గొన్నారు.

చిట్టేడుతో ఇంటింటికీ టీడీపీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 10: మండల పరిధిలోని చిట్టేడులో బుధవారం ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం జరిగింది. పంచాయతీ పరిధిలోని నందమూరు బసవతారక కాలనీ, దళితవాడ, గిరిజన కాలనీలో ఇంటింటా తిరిగి మేనిఫెస్టో గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రానికి అరిష్టం పట్టిందని, అది పోవాలంటే సీఎం జగన్‌ను అధికారం నుంచి శాశ్వతంగా దూరం చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు వెంకటకృష్ణారెడ్డి, మర్రి అనిల్, తూపిలి రాధాకృష్ణారెడ్డి, ఎస్సీసెల్ నాయకులు తిరుమూరు మురళి, కోటేశ్వరరావు, అనూక్, సర్పంచు రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో 'వికసిత్ భారత్'

కోట, జనవరి 10: మండల పరిధిలోని కేశవరం, మద్దాలి పంచాయతీల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పారిచర్ల భైరప్ప, మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబుతో అధికారులు ఆయా పంచాయతీల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కేశవరంలో ఎరువులు పిచికారీ చేసే డ్రోన్ పనితీరును అధికారులు రైతులకు ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజమ్మ, ఎంపీడీవో భవానీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

రోడ్డు ప్రమాదంలో పాదచారి మృతి



జనార్దన్ (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, జనవరి 10: నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని శిరసనంబేడు దళితవాడకు చెందిన మల్లేపల్లి జనార్దన్(45) మంగళవారం సాయంత్రం పెన్నేపల్లి పీఎంకే పెట్రోల్‌బంకు వద్ద 71వ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న వాహనం ఢీకొంది. తీవ్ర గాయపడిన జనార్దన్‌ను ఎస్ఐ శ్రీకాంత్ నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27 సెల్‌ఫోన్ల రికవరీ

తడ, జనవరి 10: చోరీకి గురైన 27 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. గత 3 నెలల సమయంలో తడ పరిధిలో వివిధ చోట్ల సుమారు 27 సెల్‌ఫోన్లను దొంగలు చోరీ చేశారు. ఐఎంఈఐ నెంబర్ ద్వారా ఆ సెల్‌ఫోన్లను గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. బాధితులు ఐఎంఈఐ నెంబర్‌తో పాటు ఆధార్‌కార్డును సమర్పిస్తే సెల్‌ఫోన్లను అందజేస్తామని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. సమావేశంలో సీఐ మధుబాబు, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గొట్టిప్రోలులో కబడ్డీ పోటీలు

నాయుడుపేట, జనవరి 10: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించి వారిలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కస్తూరి ఫౌండేషన్ అధ్వర్యంలో పరసా పొందయ్య, రోశమ్మ జ్ఞాపకార్థం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీకారం చుట్టారు. సంక్రాంతి పండుగను పురష్కరించుకొని మండలంలోని గొట్టిప్రోలు గ్రామంలో గొట్టిప్రోలు కబడ్డీ అసోసియేషన్ అధ్వర్యంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో క్రీడలతో పాటు ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. మొదటి బహుమతిగా రూ. 30016, రెండవ బహుమతి రూ. 20116, మూడవ బహుమతి 10116 టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరసారత్నం చేతుల మీదుగా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గుంతలనే గుర్తించండి

కోట, జనవరి 10: గ్రామాల్లో భూగర్భజలాలను పెంపొందించే గుంతలను మాత్రమే గుర్తించాలని ఉపాధి ఏపీవో పూర్ణిమ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై క్షేత్ర సహాయకులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ వర్షాకాలం వెళ్లిపోయినందున ప్రస్తుత సీజన్‌లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించాలన్నారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు భాస్కర్‌బాబు, శాంతి, పరుశురామ్ పాల్గొన్నారు.





చిల్లకూరులో క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ కల్యాణ్‌చక్రవర్తి - దక్కిలిలో క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న రాంకుమార్ రెడ్డి

ఆడిద్దామంటే... ఆడేవారేరీ?

- మొక్కుబడిగా ఆడుదాం... ఆంధ్రా పోటీలు
- ఆసక్తి చూపని క్రీడాకారులు
- చిల్లకూరులో ఆలస్యంగా ప్రారంభోత్సవం
- మధ్యాహ్నం వరకు నిరీక్షించి వెళ్లిపోయిన యువత

చిల్లకూరు, జనవరి 10: గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం... ఆంధ్రా కార్యక్రమం ప్రచారానికే పరిమితమైంది. క్షేత్రస్థాయిలో క్రీడాకారుల నుంచి స్పందన రాకపోవడంతో సిబ్బంది మొక్కుబడిగా పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఆడుదాం... ఆంధ్రా పోటీలను ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి ప్రారంభించారు. ఉదయం 8గంటలకు హాజరు కావాలని క్రీడాకారులకు చెప్పడంతో వారు ఆ సమయానికే మైదానికి చేరుకున్నారు. అయితే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ 12గంటలు అయినా రాకపోకవడంతో క్రీడాకారులు వెనుదిరిగారు. దీంతో అధికారులు 12:40గంటలకు జడ్పీటీసీ మన్నెం శీనయ్య చేతుల మీదుగా క్రీడాపోటీలను ప్రారంభించారు. మధ్యాహ్నం 1:35గంటలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వచ్చి క్రీడజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మన్నెం శీనయ్య, బాలకృష్ణరెడ్డి, దిలీప్‌రెడ్డి, యోగి, అశోక్, అనుదీప్, శ్రీనివాసులు, అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఆడుదాం.. ఆంధ్రా మండలస్థాయి క్రీడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలిరోజు కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి కొంతసేపు ఆటలు ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దక్కిలి: స్థానిక బాలయోగి గురుకుల కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ప్రారంభించారు. వైసీపీ నేతలు చింతల శ్రీనివాసులు రెడ్డి, మాధమాల నారాయణరెడ్డి, దక్కిలి పెంచలరెడ్డి, వెలికంటి చెంచయ్య, బండి రమేష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కోళ్లపూడి వేణుపాల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాలలో మున్సిపాలిటీతో పాటు మండలంలోని సచివాయాల వారీగా ఆటల పోటీలు నిర్వహించారు. ప్రభుత్వం అందజేసిన టీ షర్ట్, టోపీ నాసిరంగా ఉండడంతో వాటిని ధరించకుండా క్రీడాకారులు కింద పడేశారు. అయితే వాటిని వేసుకుని క్రీడల్లో పాల్గొనాలని అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో ప్రభుత్వం అందజేసిన దుస్తులు వేసుకుని క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు పోటీలు ముగిశాక ఓ వీధి కుక్కకు ధరింపజేసి సరదాగా గడిపారు. కాగా, క్రీడల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి సచివాలయ అడ్మిన్లు పోటీలు నిర్వహించకలేదు. అడిగితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు మొక్కుబడిగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు క్రికెట్ పోటీల్లో శ్యామసుందరపురం, చెందోడు జట్లు తలపడాల్సి ఉంది. కొన్ని గంటలపాటు క్రీడాకారులు రాలేదు. ఇంతలో ఎంపీడీవో భవానీ, ఎంపీపీ అంజమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు క్రికెట్ ఆడి మిగతా క్రీడాకారులను ఉత్సాహపరిచారు. తరువాత శ్యామసుందరపురం జట్టు సభ్యులు వచ్చినా చెందోడు జట్టు క్రీడాకారులు రాలేదు. దీంతో అధికారులు శ్యామసుందరపురం జట్టును విజేతగా ప్రకటించారు.

బాలాయపల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలకు స్పందన కరువైంది. మండలంలోని నెడిగల్లు గ్రామం నుంచి వచ్చిన యువతులు కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారు. ఇంకో జట్టు రాకపోవడంతో నెడిగల్లు జట్టు సభ్యులనే రెండు గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించారు. అలాగే ఖోఖో కూడా వారి చేతనే ఆడించారు. జయంపు జట్టు క్రికెట్ కోసం రాగా వారిచేత వాలీబాల్ కూడా ఆడించారు. రామాపురం క్రీడాకారులకు కబడ్డీ పోటీలు మాత్రమే నిర్వహించారు. క్రికెట్ కూడా ఆడుతామని చెప్పినా అధికారులు అంగీకరించకపోవడంతో క్రీడాకారులు వాగ్వాదానికి దిగారు. అదేవిధంగా ముగ్గుల పోటీలు నిర్వహించగా మహిళలు ఎవరూ రాలేదు. దీంతో వైఎస్సార్ క్రాంతి పథం వీవోఏలు పాల్గొని ముగ్గులు వేశారు. కార్యక్రమంలో ఏపీడీవో ప్రమీలారాణి, జయంపు సొసైటీ అధ్యక్షుడు వెందోటి కార్తిక్ రెడ్డి, రాయి దేవి కాచౌదరి తదితరులు పాల్గొన్నారు.







కోటలో క్రీడాకారులు రాకపోవడంతో క్రికెట్ ఆడుతున్న అధికారులు - బాలాయపల్లిలో ఒకే కబడ్డీ జట్టు సభ్యులను ఇరువైపులా నిల్చోబెట్టి ఫొటో దిగుతున్న అధికారులు - చిల్లకూరులో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ రాలేదని పోటీలను ప్రారంభించకపోవడంతో వెళ్లిపోతున్న క్రీడాకారులు

అంగన్వాడీల ఆకలి కేకలు వినబడవా?





సూళ్లూరుపేటలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల దీక్ష - నాయుడుపేటలో కళ్లకుగంతలు కట్టుకొని నిరసన

సూళ్లూరుపేట, జనవరి 10: అంగన్వాడీల ఆకలి, కేకలు ప్రభుత్వానికి వినబడవా అని ఆ యూనియన్ నాయకురాలు హైమావతి ప్రశ్నించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన అంగన్వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 30రోజులకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనిభారం పెంచి జీతం పెంచకుండా నాలుగన్నరేళ్లుగా మాయమాటలు చెబుతూ ప్రభుత్వం కాలం గడిపిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడిగితే సీఎం జగన్ ఎస్మా చట్టం ప్రయోగిస్తామనడం దుర్మార్గమన్నారు. ఆకలితో అలమటించి రోడ్డెక్కి అడుగుతున్న తమ బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను అంగీకరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

గూడూరు: న్యాయమైన తమ డిమాండ్‌లను పరిష్కరించాలని ఆందోళన చేపడుతున్న అంగన్వాడీలను రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించి బెదిరింపులకు పాల్పడడం మంచిపద్ధతి కాదని ఆ యూనియన్ జిల్లా నాయకులు ప్రసాద్‌రావు, పుల్లయ్య అన్నారు. బుధవారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నేరవేర్చాలని అంగన్వాడీలు నెలరోజులు సమ్మెను చేస్తున్నా పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని తీసుకురావడం దారుణమన్నారు. అంగన్వాడీలకు న్యాయం జరిగేంత వరకు సమ్మెను కొనసాగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వాణిశ్రీ, ఇంద్రావతి, ప్రభావతి, పెంచలమ్మ, లక్ష్మి, మునికుమారి, హైమావతి, మంగమ్మ, సుబ్బమ్మ, శివకుమార్, సురేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

వెంకటగిరి: బంగారుపేట వద్ద ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేస్తుతన్న రిలే దీక్ష 30వ రోజు కొనసాగింది. తమ సమస్యలు పరిష్కరించే వరకు దీక్ష విరమించేదిలేదని, కాలయాపన చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు స్వరూపారాణి, మంజుల, సుభాషిణి, మమ్ములాబేగం, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కారించాలంటూ 30 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు బుధవారం కళ్లకు గంతలు కట్టుకొని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, నాగమ్మ, చెంగమ్మ, శ్యామలమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హామీలను గాలికొదిలేసిన ప్రభుత్వం





సూళ్లూరుపేట నిరసన తెలుపుతున్న కార్మికులు - వెంకటగిరిలో చెత్త తొలగింపజేస్తున్న కౌన్సిలర్లను అడ్డుకున్న మున్సిపల్ కార్మికులు

గూడూరు, జనవరి 10: మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని సీఐటీయూ పట్టణాధ్యక్షుడు బీవీ. రమణయ్య అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, అంగన్వాడీలు తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సమ్మె చేస్తున్నా అధికార ప్రజాప్రతినిధులు ఒక్కరు కూడా శిబిరం వద్దకు వచ్చి పరామర్శించకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో గోపినాద్, శివకుమార్, కోటేశ్వరరావు, పెంచలప్రసాద్, రాఘవయ్య, ప్రభావతి, సంపూర్ణమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పారిశుధ్య కార్మికుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు సాంబశివయ్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కార్మికులకు కనీసం రూ.26000 వేతనం ఇచ్చి అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయడమేకాక కార్మికుల డిమాండ్లను అంగీకరించకుండా బెదిరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు లక్ష్మయ్య, అల్లెయ్య, పద్మనాభం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు

వెంకటగిరి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ అధ్వర్యంలో కార్మికులు చేస్తున్న సమ్మె 16వ రోజుకు చేరుకోగా ఏఐటీయూసీ కార్మికులు చేస్తున్న బుధవారం 8వ రోజు కొనసాగింది. పట్టణంలో పారిశుధ్య నిర్మూలనకు మున్సిపల్ కౌన్సిలర్లు చీపురు పట్టి రోడ్డుపైకి వచ్చారు. విషయం తెలుసుకున్న పారిశుధ్య కార్మికులు శిబిరం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి రాజావీధి వద్ద కౌన్సిలర్లను అడ్డుకున్నారు. సమస్యల సాధన కోసం తాము చేస్తున్న ఉద్యమాన్ని నీరుగార్చి తమ కడుపులు కొట్టేందుకు ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారని కౌన్సిలర్లను నిలదీశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, కార్మికుల మధ్య వాగ్వాదం జరగడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పెద్దఎత్తున కార్మికులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరు జాన్, బాలాజీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జైహో సభను విజయవంతం చేయండి

గూడూరు, జనవరి 10: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం జైభారత్ సంస్థ అధ్వర్యంలో నిర్వహించనున్న జైహో సభను విజయవంతం చేయాలని ఆ సంస్థ జాతీయ కార్యదర్శి లోకనాథ్ అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద సభ పోస్టర్లును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉద్యమ స్ఫూర్తితో జైభారత్ సంస్థ అధ్వర్యంలో హిందూ - ముస్లింలు సమైక్యంగా ఉండాలని ఈ సభను నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, వెంకటేశ్వర్లు, భాస్కర్‌గౌడ్, అన్వర్, అనిల్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులతో ఉపాధ్యాయులు, సిబ్బంది

గూడూరు, జనవరి 10: క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం చేకూరుతుందని ప్రగతిసేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతిసేవాసంస్థ అధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి క్రీడాపోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పనిఒత్తిడిలో ఉండే పాఠశాలల సిబ్బంది ఆటవిడుపు కోసం క్రీడాపోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కోట శ్రీనివాసులు, కరిముల్లా, ప్రభాకర్, పెంచలయ్య, సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళం



సమావేశంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిల్లకూరు, జనవరి 10: మండలంలోని చింతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2009-10 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీ సమ్మేళనం బుధవారం జరిగింది. పూర్వ విద్యార్థులంతా ఒక చోటకు చేరి చదువుకున్ననాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, సునీత, సుమ, మంజుశ్రీ, వాసుదేవకుమార్, మాధవయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరులో వైసీపీ సంబరాలు

గూడూరు, జనవరి 10: గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధరరావు పేరు అదిష్టానం ఖరారు చేయడంతో బుధవారం రాత్రి ఆ పార్టీ నాయకులు సందరాలు చేసుకున్నారు. స్థానిక టవర్ క్లాక్ సెంటరు వద్ద బాణసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు.



టపాసులు పేల్చి సంబరాలు జరుపుకొంటున్న వైసీపీ నేతలు